https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 | సంచిక : 289 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | మంగళవారం, ఆగస్టు,18, 2026 | పేజీలు : 8 | వెల : రూ.1/-

## ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

### 22ఏ భూములపై పొంగులేటి కీలక ఆదేశాలు

**22ఏలో ఉందని దరఖాస్తు తిరస్కరించొద్దని ఆదేశం**

**భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలన**

**రికార్డులు పూర్తిగా తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలని ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్టు 17:**22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేటు భూములు చేరుతున్న అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. 22ఏను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ జాబితాలో భూమి ఉందనే కారణంతోనే దరఖాస్తును తిరస్కరించవద్దని మంత్రి సూచించారు. అసలు ఆ భూమి నిషేధిత జాబితాలోకి ఎలా వచ్చిందో పరిశీలించాలని చెప్పారు. సంబంధిత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు. నిషేధిత భూముల అంశంపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రజల నుంచి వస్తున్న



దరఖాస్తులు, ఫిర్యాదులపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు త్వరలో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. 22ఏ భూముల విషయంలో నిబంధనల పేరుతో ప్రజలకు అనవసర ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే

## భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

**ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా -14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 17:**పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు,



పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై

## 4,192 క్రిమినల్ కేసుల పెండింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దేశవ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,192 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అమికస్ క్యూరీ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. పదేళ్లకు పైగా 519 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 5 నుంచి10 ఏళ్ల మధ్య 754 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసుల సత్వర విచారణపై అమికస్ క్యూరీ తాజాగా సుప్రీంకోర్టుకు 22వ నివేదికను సమర్పించారు. అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలోని వివరాల మేరకు.. సిట్టింగ్ ఎంపీలపై 335 కేసులు పెండింగ్‌లో ఉండగా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై 1,222 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మాజీ ఎంపీలపై 269 కేసులు.. మాజీ ఎమ్మెల్యేలపై 1,339 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 700 కేసుల దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. 360 కేసులు మూడేళ్లకు పైగా దర్యాప్తులో ఉన్నాయి. ఇక, లోక్‌సభలోని 543 మంది సభ్యుల్లో 251 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని



అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ నివేదిక వెల్లడించింది. లోక్‌సభలోని 170 మంది సభ్యులపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆ నివేదిక తెలిపింది.

## విద్యార్థులు, పరిశ్రమలను కలిపే జాబ్ పోర్టల్..

## దేశంలోనే తొలిసారి: మంత్రి వివేక్

మెదక్, ఆగస్టు 17: దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి



అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పై కావాలనే కుట్ర..!

### హరీష్ రావు కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్,ఆగస్టు 17:**కల్యాణలక్ష్మి, షాది ముబారక్ పై కావాలనే కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరవాత కూడా వైఎస్ పథకాలను కొనసాగించామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు. కానీ కాంగ్రెస్ వచ్చాక కేసీఆర్ పేరు ఉండొద్దనే పథకాలు తొలగిస్తున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వచ్చిన తరవాతే రైతు బీమా పథకాన్ని తొలగించారని చెప్పారు. రైతు బీమా ప్రపంచానికే ఆదర్శం అని వ్యాఖ్యానించారు. 1999లోనే ల్యాండ్ సీలింగ్ యాక్ట్ రద్దు చేశారన్నారు. అడ్డగోలుగా భూములను నిషేదిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. సరూర్ నగర్ లోని భూములను బ్లాక్ లిస్టులో పెట్టారని.. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా నిషేదిత జాబితాలోనే ఉందని అన్నారు. అందుకే తొలగించాలని హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. సీఎం పరిస్థితి ఇలా ఉంటే ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ లిస్టు నుండి భూములను తొలగించాలంటే కమీషన్ అడుగున్నారని, రెవెన్యూలో ఏ పనిచేయాలన్నా 30శాతం ఇవ్వాల్సిందేనని చెప్పారు. నిషేదిత భూములపై స్వేత పత్రం విడుదల చేయాలని, జీఆర్ఎంబీ సమావేశం వాయిదా బీఆర్ఎస్ విజయం అని చెప్పారు.

## పశ్చిమ బెంగాల్‌లో అగ్నిప్రమాదం..

## ఏడుగురు సజీవదహనం

**కోల్‌కతా,ఆగస్టు 17:** పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా తారాపీఠ్‌లో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఓ నాలుగు అంతస్తుల హోటల్‌లో సోమవారం ఉదయం సుమారు 4.30–-5 గంటల సమయంలో మంటలు చెలరేగాయి.

ప్రమాద సమయంలో పలువురు భక్తులు నిద్రలో ఉండగా.. అందులో ఏడుగురు సజీవదహనమయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి బాధితులను రక్షించారు. క్షతగాత్రులను రాంపూర్‌హాట్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. దర్యాప్తు చేపట్టారు





# బీడీకార్మికులకు 4016జీవనభృతి ఇవ్వాలి



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 16 (డీకే చాటింపు): నిజామాబాద్ రూరల్ నియోజక వర్గండిచ్పల్లి మండలంలోనీ లింగ సముద్రం గ్రామంలో ఐ ఫ్ టీ యూ ఆధ్వర్యంలో బీడీ కార్మికుల సమస్యలపై సమావేశం జరిగింది.బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో 4016 నెల నెల జీవన భృతి ఇస్తామని ప్రకటించి 3 సంవత్సరాల అయిన ఇప్పటికీ సరిగా అమలు చేయడం లేదని, జీవన భృతి అందరూ బీడీ కార్మికులకు అందించాలని ఐ ఫ్ టీ యూ ప్రధాన కార్యదర్శి జేసీ గంగాధర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు421000 బీడీ కార్మికులు ఉండగా ఒక్క నిజామాబాద్ జిల్లా లోనే 200000 బీడీ కార్మికులు ఉన్నారని,మహిళలకు పెద్ద పీట వేస్తున్నా మణి చెప్పే ప్రభుత్వం మా పట్ల ఎందుకు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యకం చేశారు.బీడీ కార్మికుల కు జీవన భృతి 4026గా మంజూరు చేయించుటలో స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డి,ఎమ్మెల్సీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యమంతి తో మాట్లాడి రాష్ట్రంలోని బీడీ కార్మికులందరికీ న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ



ప్రకారం అమలు చేయాలని లేని పక్షంలో అసెంబ్లీ ముట్టడికి ఐఎఫ్టియు మరియు ఇతర సంఘాల అందరి ద్వారా చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని తెలిపారు .సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్మికులు నాగమణి విజయలక్ష్మి జిల్లా సహాయ కార్యదర్శి సుప్రియ పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు అభినందనలు

## చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి రాజారమేష్





క్యాతన్ పల్లి(డీకే చాటింపు): రామకృష్ణాపూర్ పట్టనానికి చెందిన తమ్ముడు రాకేష్ జ్ఞాపకార్థం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించిన తన స్నేహితులు. ఈ టోర్నమెంట్ నిర్వాహకులు ముఖ్య అతిథులుగా చైర్ పర్సన్ డాక్టర్ సంధ్య రాణి చెన్నూర్ నియోజకవర్గ నాయకులు, డాక్టర్ రాజా రమేష్ అన్న, రాకేష్ తండ్రి కుమార్ , రామిడి కుమార్, నాయకులను ఆహ్వానించారు. సింగరేణి ఎలెవన్ విజేతలుగా నిలువగా, శివాజీ ఎలెవన్ రన్నర్స్ గా నిలిచారు వారికి ముఖ్య అతిథుల బహుమతులు అందించారు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా రమేష్ అన్న మాట్లాడుతూ... తమ్ముడు రాకేష్ భౌతికంగా మనకు దూరమైన తన జ్ఞాపకాలు స్నేహితులు గుండెల్లో ఎల్లప్పుడూ పదిలంగా ఉంటాయని అన్నారు. యువతకు మరి ముఖ్యంగా మన క్యాతనపల్లి యువకులకు దయచేసి మద్యం సేవించి మరియు అతి వేగంగా బైకులను నడుపొద్దని సూచించారు. వేగంగా ఇంటికి చేరడం కంటే క్షేమంగా ఇంటికి చేరడం ముఖ్యమని, ఇంట్లో మన తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు మనకోసం ఎదురుచూస్తూ ఉంటారన్న విషయాన్ని మరువద్దని గుర్తు చేశారు. చిన్న వయసులో ఆక్సిడెంట్ ద్వారా చనిపోతే తల్లిదండ్రులు జీవితాంతం మనోవేదనకు గురౌతారని, ఆ బాధ నుండి బయటికి రాడానికి ఒక్క జన్మ పడుతుంది అన్నారు. యువత మంచిగ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రామిడి కుమార్, జిలకర మహేష్, యువ నాయకులు అరుణ్ రిషి, లక్ష్మీకాంత్, కరుణాకర్, శ్రీకాంత్, మణి కుమార్, ఫజల్ , రాకేష్ మిత్రులు తిరుపతి రెడ్డి, పూర్ణేష్, రామ్ చరణ్, శివ, నితీష్, నికిల్, వర్మేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్న నాగుల పంచమి

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు17(డీ కే చాటింపు): శ్రావణమాసం శుక్ల పక్ష పంచమి నీ నాగ పంచమిగా హిందువులు ఘనంగా జరుపుకుంటారు. నిజామాబాద్ నగరం లోని వీక్లీ మార్కెట్లో నాగేంద్ర గుడి, కంటేశ్వర్ శివాలయంలోని నాగ దేవత పుట్ట దగ్గర అదే విధంగా గోపనపల్లి పరిధిలోని నాగదేవత పుట్టలో, నాగారం, ఆర్యా నగర్,పెద్దమ్మ తల్లి దేవాలయ నాగ పుట్ట లో ఆవుపాలు పోసి పూజలు ఘనంగా మహిళలు నిర్వహించారు.ఆవుపాలు వివిధ సంఘాల వారు నగరంలో ఉచితంగా పంపిణీ చేశారు.పూజ అనంతరం గోధుమ ,సేమియా పాయసం లతో నాగ దేవతలకునైవేద్యం పెట్టారు.ఈ పండగ రోజున అక్కా చెల్లెలు కొత్త బట్టలునగలతో ముస్తాబు అయ్యి అన్నదమ్ములకు పుట్ట వద్ద పెట్టిన పాలతో కళ్ళు కడుగుతారు. ఈరోజు నాగదేవతను పూజించడం వల్ల ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ శుభం చేకూరుతుందని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటున్నారు. ముఖ్యంగా సంతానం లేని వారు పెళ్లి కాని వారు మొక్కలు చెల్లించు కుంటే నెరవేరుతాయి అని అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయని భక్తుల నమ్మకం .



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్



క్యాతన్ పల్లి (డీకే చాటింపు):రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మునిసిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ పార్టీ--రామకృష్ణాపూర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి, నివసిస్తున్న లబ్ధిదారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ--రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు ప్రధానంగా డ్రైనేజీ సమస్య, రోడ్ల సమస్య, తాగునీటి ఇబ్బందులు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, చెట్ల పొదలు తొలగించడం, ప్రహరీ గోడ నిర్మాణం వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 2019లో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 2022లో నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడంలో జాప్యం జరిగిందని పేర్కొన్నారు. దీంతో కొంతకాలం ఇళ్లు ఖాళీగా ఉండటంతో కిటికీలు, తలుపులు, వాటర్ ట్యాంకులు, స్ట్రీట్ లైట్లు తదితర సదుపాయాలు శిథిలావస్థకు చేరడంతో పాటు, ఆ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని తెలిపారు. 2023లో చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఎన్నికైన, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మరమ్మతులు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. తమ విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి రూ.27 లక్షల నిధులు మంజూరు చేయించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత 2025లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు.ప్రస్తుతం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.క్యాతనపల్లి మునిసిపాలిటీ లో పాలకవర్గం ఏదైనా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందని , ప్రజలకు సంబంధించిన సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, పల్లె శ్రీదేవి, మాజీ జెడ్పిటిసి యాకూబ్ అలీ, మాజీ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన, ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి రాజేష్ నాయకులు కొక్కుల సతీష్, కట్ల రమేష్, నక్క శ్రీనివాస్, మస్కం సంపత్, నాగుల రాజ్ కుమార్, జోగుల వెంకటేశ్వర్లు, నేరెళ్ల చంద్రయ్య, రాంసాయి , శంకర్, రాజు మహిళా నాయకులు రాజేశ్వరి, దీప, పుష్ప తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణికి 80ఫిర్యాదులు



నిజామాబాద్ప్రతినిధి, ఆగస్టు 17 (డీ కే చాటింపు): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ సాయన్న, ట్రైనీ ఆర్డీఓ సందీప్, రూరల్ ఎస్.హెచ్.ఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్‌ను రూపుమాపే కుట్రలను తిప్పికొడతాం

## - పేదింటి ఆడబిడ్డల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదు: సబితా ఇంద్రారెడ్డి- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం,ఆగస్టు 17 (డీకే చాటింపు) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో మండల కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి, కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఎమ్మార్వోకు వినతిపత్రం

అందజేశామని సబితా ఇంద్రారెడ్డి గారు పేర్కొన్నారు.పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఎంతటి ఆర్థిక భారమో అందరికీ తెలుసని, ఆ బాధను అర్థం చేసుకున్న కేసీఆర్ గారు పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తీసుకొచ్చారని అన్నారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తూ వేలాది పేద కుటుంబాలకు ఈ పథకం అండగా నిలిచిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకానికి సంబంధించి లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తాలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కల్యాణలక్ష్మి--షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకపో?

# బోనాల ఉత్సవాలకు పటిష్ట పారిశుధ్య ఏర్పాట్లు చేయాలి

## జోనల్ కమిషనర్ వికాస్ మహతో ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన: నాగోల్ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం అధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్

ఎల్బీనగర్, ఆగస్టు 17 (డీకే చాటింపు) నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోలు చెరువు పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్న బోనాల మహోత్సవాలను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, వీధిదీపాలు, మౌలిక వసతులపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ వికాస్ మహతో ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోలు చెరువు పరిసర ప్రాంతాల్లోని పోచమ్మ దేవాలయం మరియు శ్రీ మహంకాళి దేవాలయాల్లో 24-08-2026 నుండి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, 26-08-2026న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలు, 30-08-2026న బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కి వివరించారు.ఈ మహోత్సవాలకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ప్రముఖులు మరియు వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో నాగోలు చెరువు కట్ట పరిసరాలు, దేవాలయాలకు వెళ్లే ప్రధాన మార్గాలు మరియు భక్తుల రాకపోకలు జరిగే ప్రాంతాల్లో పూర్తిస్థాయి పారిశుధ్య చర్యలు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని కోరారు.ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, మురుగు మరియు పారిశుధ్య లోపాలు ఉన్నందున వీఐపీ, ప్రజాప్రతినిధుల పర్యటనలు మరియు వేలాది మంది భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.ఉత్సవాలు పూర్తయ్యే వరకు ప్రత్యేక శానిటేషన్ టీమ్స్ ఏర్పాటు చేసి, నాగోలు చెరువు పరిసరాలు, పోచమ్మ మరియు మహంకాళి దేవాలయాల పరిసర ప్రాంతాలు, భక్తులు రాకపోకలు సాగించే మార్గాలను ప్రతిరోజూ శుభ్రపరిచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.అదేవిధంగా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించడం, మురుగు సమస్యలను పరిష్కరించడం, అవసరమైన చోట వీధిదీపాలను మరమ్మతు చేసి రాత్రివేళల్లో తగినంత వెలుతురు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో గారిని ఘనంగా సన్మానించి, బోనాల మహోత్సవానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ గారు సమస్యలపై సానుకూలంగా స్పందించి, బోనాల ఉత్సవాలు పూర్తయ్యే వరకు కాలనీ వాసులకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నాగోల్‌లో జరిగే బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో, పరిశుభ్రత మరియు భద్రతకు ఎలాంటి లోటు లేకుండా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జోనల్ కమిషనర్ హామీ ఇవ్వడం పట్ల నాగోల్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగోల్ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం అధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ గారు, మహంకాళి దేవాలయం అధ్యక్షులు బద్దం మహేందర్ గౌడ్ గారు, వస్పరి మల్లేష్, డప్పు రాజు, రావుల శ్రీనివాస్ గౌడ్, మైనం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
మంగళవారం, ఆగస్టు,18, 2026

# చీకటిపై వెలుగుల విజయం

కాలానుగుణంగా విజ్ఞాన రంగాలు, సాంకేతిక ఆవిష్కరణలు మానవ జీవన శైలితో పాటే క్రీడా జగత్తులోనూ నూతన విప్లవాలకు బాటలు వేస్తాయి. నేడు పసిడి వెలుగుల కాంతులతో ప్రకాశించే ఆధునిక క్రీడాంగణాలు, ట్వంటీ-20 లీగ్‌ల హోరు, ఐపీఎల్ కోలాహలం, సుదూర ప్రాంతాల ప్రేక్షకులను సైతం హాల్లోనే కట్టిపడేసే వర్ణరంజిత ప్రసారాలు, ఫ్లడ్‌లైట్ల కింద గులాబీ బంతితో నిర్వహించే డే-నైట్ టెస్టు మ్యాచ్‌లు మనకు అత్యంత సహజమైన క్రీడా దృశ్యాలుగా మారిపోయాయి. అయితే, రాత్రివేళల్లో క్రికెట్ ఆడవచ్చనే ఒక వినూత్న భావన ఆవిర్భవించడం వెనుక, దానికి ప్రాథమిక ప్రయోగాత్మక రూపం సిద్ధించడం వెనుక దాదాపు నూట యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్ర దాగి ఉందనే సత్యం ఎంతైనా గమనార్హం. పంతొమ్మిదవ శతాబ్దపు చివరి దశలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో మిణుకు మిణుకుమనే గ్యాస్ దీపాలు, తొలితరం విద్యుత్ ఆర్క్ లైట్ల కాంతిలో జరిగిన ఒక సాహసోపేతమైన క్రీడా ప్రయోగం, నేటి బిలియన్ డాలర్ల రాత్రి క్రికెట్ సామ్రాజ్యానికి అంకురార్పణ చేసింది. అది కేవలం మైదానంలో రెండు జట్ల మధ్య జరిగిన ప్రదర్శనాత్మక సమరం మాత్రమే కాదు; సంప్రదాయ క్రీడా సూత్రాలను సవాలు చేస్తూ, చీకటి పొరలను చీల్చుకుంటూ సరికొత్త భవిష్యత్తు దిశగా అడుగులు వేసిన దిశా నిర్దేశక చారిత్రక ఘట్టం. పంతొమ్మిదవ శతాబ్దపు సుదీర్ఘ కాలంలో క్రికెట్ అనేది సంపూర్ణంగా భాస్కరుడి వెలుగుపైనే ఆధారపడిన పగటిపూట క్రీడగా కొనసాగింది. పొద్దుపొడిచిన వేళ మైదానంలోకి దిగడం, సూర్యాస్తమయంతో ఆట ముగించడం అనవాయితీగా వచ్చేది. అయితే, పారిశ్రామిక విప్లవ వేగవంతమైన విస్తరణతో ప్రపంచ వ్యాప్తంగా సామాజిక విధానాలు, కార్మిక రంగాలు రూపాంతరం చెందాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్మాగారాలు, వ్యాపార సంస్థలలో శ్రమించే ఉద్యోగులు క్రీడానుభూతిని పొందడానికి పగటి వేళల్లో మైదానాలకు రాలేకపోతున్నారనే చేదు నిజాన్ని నాటి నిర్వాహకులు గుర్తించారు. ప్రజల జీవన శైలికి క్రీడలను అనుసంధానించకపోతే ప్రేక్షకాదరణ సన్నగిల్లే ప్రమాదం ఉందని గ్రహించిన మెల్‌బోర్న్ క్రికెట్ క్లబ్ ప్రతినిధులు, పగటి వెలుతురు ముగిసిన తర్వాత రాత్రి వేళల్లో ఆటను నిర్వహించాలనే క్రాంతదర్శి ఆలోచనకు పదును పెట్టారు. ఫలితంగా 1879వ సంవత్సరం ఆగస్టు 5వ తేదీన మెల్‌బోర్న్ క్రీడాంగణం వేదికగా చీకటిలో క్రీడలను నిర్వహించే వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఆ కాలంలో ఆధునిక విద్యుత్ ఫ్లడ్‌లైటింగ్ వ్యవస్థ శైశవ దశలో కూడా లేకపోవడం ఒక పెద్ద సాంకేతిక ప్రతిబంధకంగా మారింది. వీధుల్లో వెలిగే గ్యాస్ దీపాలు, ఆవిరి ఇంజిన్ల సహాయంతో నడిచే తొలితరం ఆర్క్ లైటింగ్ పరికరాలను మైదానం చుట్టూ ఎత్తైన స్తంభాలపై అమర్చి కాంతిని వెదజల్లే ఏర్పాటు చేశారు. మైదానమంతా ఏకరూపంలో ప్రకాశించడం ఆ సాంకేతిక పరిమితుల వల్ల సాధ్యపడలేదు. మైదానంలో అక్కడక్కడా వెలుగు పడుతుంటే, మరికొన్ని ప్రదేశాల్లో నిశీధి నీడలు కమ్ముకునేవి. అయినప్పటికీ, ఈ చారిత్రక దృశ్యాన్ని వీక్షించడానికి సుమారు మూడు వేల నుంచి ఏడు వేల మంది దాకా ఉత్సాహవంతులైన ప్రేక్షకులు క్రీడాంగణానికి తరలివచ్చినట్లు నాటి సమకాలీన పత్రికలైన 'ది ఆర్గస్' వంటి కథనాలు ప్రస్థావించాయి. విక్టోరియా ప్రాంతానికి చెందిన క్రీడాకారులు, స్థానిక మిలిటరీ క్లబ్ జట్ల మధ్య జరిగిన ఈ ప్రదర్శన మ్యాచ్ ప్రేక్షకుల్లో అపారమైన కౌతూహలాన్ని నింపింది. ఆ సమరంలో ఆటగాళ్లకు తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. నల్లటి రాత్రి ఆకాశం నేపథ్యంలో బంతిని గుర్తించడం ఆటగాళ్లకు అగ్నిపరీక్షగా మారింది. ముఖ్యంగా బౌలర్ విసిరిన వేగవంతమైన బంతి కాంతి నీడల మధ్య నుంచి వస్తున్నప్పుడు బ్యాటర్లు దాని వేగాన్ని అంచనా వేయలేక తీవ్రంగా తడబడ్డారు. ఆకాశంలోకి లేచిన ఎత్తైన క్యాచ్‌లను ఫీల్డర్లు వెతికి పట్టుకోవడం గగనమైంది. కాంతి మందగించడం, దీపాల వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక అంతరాయాల వల్ల మ్యాచ్ మధ్యలో తెల్లటి బంతిని ప్రవేశపెట్టడం, ఆ బంతి కాస్తా పగిలి పోవడంతో మళ్లీ సాధారణ బంతితో ఆడాల్సి రావడం వంటి విచిత్రమైన ఘట్టాలు చోటుచేసు కున్నాయి. ప్రతిష్టాత్మక విజయాల కంటే కూడా, చీకటిలో ఆట సాధ్యమేనా అనే ప్రశ్నలకు జవాబు వెతికే ప్రయోగంగానే ఈ మ్యాచ్ సాగింది. ఆటగాళ్ళు కొద్దిసేపటికే ఆ అసమాన కాంతికి అలవాటు పడుతూ క్రీడాస్ఫూర్తిని చాటుకోవడం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. 1879 నాటి ఈ గ్యాస్-ఆర్క్ లైట్ల ప్రయోగం పరిమిత కాంతి, తీవ్రమైన నిర్వహణ వ్యయం వల్ల వెంటనే శాశ్వత విధానంగా మారలేకపోయినప్పటికీ క్రీడా ప్రపంచపు ఊహాశక్తికి కొత్త రెక్కలు తొడిగింది.

విలేకరులు కావలెను

రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక

డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను కొనసాగిస్తాం

## - స్పష్టం చేసిన మంత్రులు పొన్నం, అడ్లూరి- బీఆర్ఎస్‌ది రాజకీయ డ్రామా అని ఆగ్రహం



హైదరాబాద్ సచివాలయ ప్రతినిధి(డీకే చాటింపు): పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ రాజకీయ డ్రామాలాడుతోందని మండిపడ్డారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఈ పథకాల అమలుపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. పథకాల అమలుపై ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించి కోర్ట్ ఇచ్చిన స్టేని వెకేట్ చేయించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు మంత్రులు సోమవారం హైదరాబాదులోని సచివాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై స్టే విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వటానికి దారితీసిన పరిస్థితులపై సర్కారు పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. "కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో అపోహలు పెంచేందుకు ధర్నాలక పిలుపునిచ్చింది. వాస్తవానికి ఆ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలను మేం కూడా కొనసాగిస్తున్నసంగతిని గమనించాలి. బీఆర్ఎస్ పార్టీ మాదిరిగా మాకూ రాజకీయ దురుద్దేశాలు ఉంటే ఆ పథకాలను నిలిపేసేవాళ్లం కదా?. నిజానికి మాకు అలాంటి ఆలోచనలు లేవు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై సమగ్రంగా విచారణ జరుపుతున్నాం. కోర్టులపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. న్యాయపరంగా అన్ని ప్రయత్నాలు చేయటం ద్వారా కోర్టు స్టేని వెకేట్ చేస్తుందని విశ్వసిస్తున్నాం. గతంలో ఓ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకొని లీగల్‌గా వాదనలు వినిపిస్తాం. గతంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం లోపభూయిష్టంగా వ్యవహరించటం వల్లే ఇప్పుడీ పరిస్థితి వచ్చింది. ఇది కులమతాల వివాదం కాదు. ఇవి బడుగు బలహీనవర్గాలకు సంబంధించిన పథకాలు. వీటిని కొనసాగించటంలో మాకు రెండో ఆలోచనలేదు. అవసరమైతే ఈ పథకాలను భవిష్యత్తులో మరింత విస్తరిస్తాం. ముందు ముందు ఎలాంటి ఆటంకాలూ రాకుండా చూస్తాం. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్‌లకు గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నాం. కళ్యాణలక్ష్మి పథకంపై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేయబడింది. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళుతున్నాం. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం. ఈ పథకంలో లొసుగులు ఏవైనా ఉంటే అవి గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తింది. అప్పుడు సరైన రీతిలో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. మా ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తాం. గత ప్రభుత్వం లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయింది. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసేవారి లోపమా అని విచారణ చేస్తున్నాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. 2014లో ప్రారంభమైన ఈ పథకాలు అనంతరం బీసీ, ఈబీసీల వర్గాలకు కూడా విస్తరించాయి. ఇప్పటివరకు పథకాల ద్వారా భారీ ప్రయోజనం కలిగింది. అధికారిక వివరాల ప్రకారం.. ఈ పథకాల ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎస్సీల్లో 2,73,164 మంది లబ్ధిదారులకు రూ.2,734.81 కోట్లు, ఎస్టీలకు 1,79,939 మందికి రూ.1,801.48 కోట్లు, బీసీల్లో 7,79,401 మందికి రూ.7,803.05 కోట్లు, ఈబీసీల్లో 83,074 మందికి రూ.831.70 కోట్లు, మైనారిటీల్లో 3,62,769 మందికి రూ.3,204.83 కోట్లు, మొత్తం రూ.16,375.87 కోట్లు అందాయి. ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.16,375.87 కోట్లకు పైగా ఖర్చు చేసి 16,78,347 మంది లబ్ధిదారులకు ప్రయోజనం అందింది. పథకాలు ఎటువంటి చట్టాన్ని అమలుచేయడానికి రూపొందించినవి కావు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162 కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న కార్యనిర్వాహక అధికారంతో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని సంక్షేమ అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ ద్వారా పథకాలు రూపొందించడానికి రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగి ఉంది. దీనికి సుప్రీంకోర్టు రాయ్ సాహిబ్ రామ్ జవాయ కపూర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ తీర్పు కూడా ముఖ్యమైన న్యాయ ఆధారం. పథకాలు ఎసెన్షియల్ లెజిస్లేటివ్ ఫంక్షన్‌ను ప్రభుత్వం చేపట్టిందన్న వాదన సరైంది కాదు. ఇవి డెలిగేటెడ్ లెజిస్లేషన్ కాదు. ఎగ్జిక్యూటివ్ వెల్ఫేర్ స్కీమ్స్. పథకాల కోసం కేటాయించే నిధులకు రాష్ట్ర బడ్జెట్ ద్వారా శాసనసభ ఆమోదం ఉంటుంది. ట్రెజరీ రూల్స్, ఫైనాన్షియల్ కోడ్ తదితర ఆర్థిక నిబంధనలకు అనుగుణంగానే నిధులు విడుదలవుతాయి. పథకాల్లో అర్హత, ఆదాయ పరిమితి, వయసు, ఆధార్, వివాహం తదితర అంశాలపై నిర్దిష్ట నిబంధనలు ఉన్నాయి. వివాహ సమయానికి వధువు 18 సంవత్సరాలు పూర్తి చేసి ఉండటం తప్పనిసరి. ఆర్డీఓ, ఎమ్మార్వో స్థాయిలో లబ్ధిదారుల అర్హతను పరిశీలించే వెరిఫికేషన్ మెకానిజం ఉంది. కాబట్టి ప్రజాధనాన్ని ఎలాంటి నియంత్రణ లేకుండా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు వాస్తవానికి విరుద్ధం. కాగ్ నివేదికలోని అభ్యంతరాలు, సూచనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. అవి పథకం చట్టవిరుద్ధమని తుది న్యాయ నిర్ణయం కావు. వివాహాన్ని కేవలం ప్రైవేట్ ఈవెంట్‌గా చూడటం సరికాదు. పేద కుటుంబానికి వివాహం ఒక సామాజిక, ఆర్థిక బాధ్యత. పేద కుటుంబాలు అప్పులు చేసి, ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం అందించే సహాయం ఇది. ఈ పథకాలు సామాజిక న్యాయం, బలహీన వర్గాల సంక్షేమం అనే రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయి. ఆర్టికల్ 46 ముఖ్యంగా బలహీన వర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాల అభివృద్ధికి రాష్ట్రం కృషి చేయాలని సూచిస్తుంది. డబ్ల్యూపీ నంబర్ 21732/2026లో ఈ నెల 12న హైకోర్టు వచ్చే నెల 9 వరకు మధ్యంతర స్టే ఇచ్చింది. కోర్టు ఆదేశాలను ప్రభుత్వం గౌరవిస్తుంది. అదే సమయంలో ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ ద్వారా పథకాల చట్టబద్ధత, రాజ్యాంగబద్ధత, ప్రజా ప్రయోజనాన్ని వివరించింది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లపై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారని స్టే ఇచ్చింది. పథకాన్ని ఎత్తివేయలేదు. పథకాన్ని కొనసాగిస్తున్నాం. ఇది గత ప్రభుత్వ పథకం. దీన్ని ఎత్తివేయాలని మేం ఆలోచన చేయలేదు. గతంలో నిధుల కేటాయింపులకు సంబంధించి ఇబ్బంది ఉన్నా మేం వచ్చిన తర్వాత గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేశాం. వాళ్లు చేసిన అప్పులు, దాన్ని తొలగించడానికి నిధులను సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. దీన్ని బీఆర్ఎస్‌వాళ్లు రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన పథకం అని నిర్లక్ష్యం చేయకుండా మేం కొనసాగిస్తున్నాం. కొంత మంది వ్యక్తులు కోర్టుకు వెళ్లినప్పుడు కోర్టు పట్ల అపార గౌరవంతో స్టే తొలగించుకొని ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలకు ఎంత మందికి ఇళ్లు ఇచ్చింది? ఎంత మందికి ఉపాధి కల్పించింది? చర్చ చేద్దాం. బీసీ కుల గణన జరిగితే భాగస్వామ్యం కాని వారు ధర్నా చేస్తున్నారు. దీని మీద రాజకీయం చేయడం అనవసరం అని మినిమం కామన్ సెన్స్ లేదా? ప్రభుత్వానికి దురుద్దేశం ఉంటే కోర్టులో మీరెందుకు ఇంప్లిమెంట్ ఇవ్వలేదు. పథకాన్ని తొలగించాలని మాకు ఎలాంటి దురుద్దేశం లేదు. బడ్జెట్‌కి సంబంధించి రాష్ట్ర శాసన సభ ఆమోదం పొంది ఉంది. పేద పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నవారికి బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. గత నెల 12న స్టే విధించింది. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటివరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకుపోయాం. డివిజన్ బెంచ్‌కి అప్పీల్‌కి వెళ్లి న్యాయపరంగా ముందుకు పోతున్నాం. ప్రభుత్వం తరపున న్యాయపరంగా జాప్యం జరిగిందా? అధికారుల లోపమా అని విచారణ జరుపుతున్నాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారుల లోపమా? న్యాయపరంగా ప్రభుత్వ వ్యవహారాలు చూసే వారి లోపమా? అని ప్రభుత్వం విచారణ చేస్తుంది. ఎవరి తప్పిదమో వారిపై చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వం తెచ్చిన జీవోల ప్రకారం మేం ఈ పథకాన్ని కొనసాగిస్తున్నాం. మాకు ఈ పథకంపై దురుద్దేశం లేదు. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్నా.. మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేం కొనసాగిస్తున్నాం. గత ప్రభుత్వంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు తీసుకోవడానికి సంకలో పిల్లని ఎత్తుకొని వచ్చి చెక్కు తీసుకునే పరిస్థితి ఉండే. మా ప్రభుత్వం రాగానే నోడల్ ఏజెన్సీ ద్వారా పేద ప్రజలకు ఉపయోగపడే ఈ పథకానికి నిధులు గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేస్తున్నాం. మరో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. "కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఇలాంటి పరిస్థితి రావటం దురదృష్టకరం. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఏదైనా చట్టాన్ని లేదా పథకాన్ని రూపొందించేటప్పుడే లోపరహితంగా చేయాల్సింది. అలా చేయకపోవటం వల్లే ఇప్పుడు ఇబ్బందులు వచ్చాయి. అయినా కూడా లబ్ధిదారులు నిరుత్సాహపడొద్దు. పథకాలు కొనసాగుతాయి. గతంలో ప్రభుత్వంలో ఉన్నప్పుడు లోపాలతో పథకాలను రూపొందించిన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ప్రస్తుతం మాకు నీతులు చెబుతోంది. రైతుబంధు, రైతుబీమా పథకాలను వాళ్లు ప్రవేశపెట్టిన ప్పటికీ మేం కొనసాగిస్తున్నాం. వాటి మాదిరిగానే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కూడా ఆటంకాలు లేకుండా లబ్ధిదారులకు అందుతాయి. అందువల్ల బీఆర్ఎస్ పార్టీ ఎన్ని పొర్లుదండాలు పెట్టినా జనం నమ్మరు. ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాబట్టి ఇవాళ ఈ వివరాలను వెల్లడిస్తున్నాం. ప్రతిపక్ష పార్టీ ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవాస్తవాలను ప్రచారం చేయొద్దని కోరుతున్నాం. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్‌లు యథావిధిగా వస్తాయి" అని వివరించారు.

**నేడు పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ**

బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ జరుపుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, బలహీన వర్గాల నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయగలరు. మొన్నే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయ్ పూలే విగ్రహా విష్కరణ చేసుకున్నాం. అమరవీరుల స్థూపం పక్కన జరిగే పాపన్న గౌడ్ విగ్రహా విష్కరణకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలి' అని మంత్రి పొన్నం కోరారు.

# నందనవనం వాంబే కాలనీ లో ఘనంగా బోనాలు

## హస్తినాపురం డివిజన్ బి ఆర్ ఎస్ బీసీ సెల్ ఉప అధ్యక్షుడు కమ్మరి నారాయణ చారి బీసీ సెల్

ఎల్బీనగర్, ఆగస్టు17, డీకే చాటింపు:- నందనవనం వాంబే కాలనీలోని బోనాల పండు వేడుకలు అద్భుతంగా జరిగాయనీ హస్తినాపురం డివిజన్ బి ఆర్ ఎస్ బీసీ సెల్ ఉప అధ్యక్షుడు కమ్మరి నారాయణ చారి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి అందరిని చల్లగా చూడాలని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి వేడుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో వాంబే కాలనీ యూత్ లీడర్, నల్ల పోచమ్మ ఆలయ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మరియు వాంబే కాలనీ ప్రెసిడెంట్ సిహెచ్ విష్ణు శ్రీ పోచమ్మ గుడి జనరల్ సెక్రెటరీ బర్పటి వెంకన్న, రేణుక ఎల్లమ్మ ఆలయ అధ్యక్షులు ఎడ్ల శ్రీను, రేణుక ఎల్లమ్మ ఆలయ జనరల్ సెక్రెటరీ శివకృష్ణ, మరియు సంగీపేట్ నరేష్, శ్రీను,



మహేందర్, సాయి కృష్ణ, నరేష్, అంజయ్య, డి బాలయ్య, మణికాంత్, రాజు గౌడ్ సాయి తదితరులు ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారి బోనాల పండుగ అద్భుతంగా కొనసాగించడం జరిగింది.

# గైనకాలజీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం

## - తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్- ఓం శ్రీ గురు హాస్పిటల్‌లో నూతన గైనకాలజిస్ట్ డాక్టర్. జ్యోష్ణ నారాణి చే నూతన వైద్య సేవలు అందుబాటులోకి తేవడం జరిగింది.




ఎల్బీనగర్,ఆగష్టు 17 (డీకే చాటింపు) నాగోల్ డివిజన్ పరిధిలోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ఓం శ్రీ గురు హాస్పిటల్‌లో నూతనంగా గైనకాలజిస్ట్ వైద్య సేవలను ఈరోజు నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు..హాస్పిటల్ యాజమాన్యం డా. శాంతి స్వరూప్, డా. లలితా బల్ల నూతన గైనకాలజిస్ట్ డాక్టర్. జ్యోష్ణ .నిర్వాహకులు రవీందర్ రెడ్డి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతల అరుణ సురేందర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా గైనకాలజీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా మహిళలకు అవసరమైన గైనకాలజీ వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీతో పాటు నాగోల్ డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఓం శ్రీ గురు హాస్పిటల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు శ్రీనివాసు ,రాక్ టౌన్ ప్రెసిడెంట్ ఎర్ర వినోద్ రెడ్డి ,మాధవ రెడ్డి , మనిపాల్ రెడ్డి , రామ్ రెడ్డి ,బద్దం బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెగడపల్లి లో రైతులకు, సైనికులకు సన్మానం



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు16 (డీ కే చాటింపు): జై జవాన్ జై కిసాన్.టి ఎమ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొ బోధన్ మండలం పెగడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముగ్గురు సైనికులు బదూరి నర్సారెడ్డి ,ఆరిరామకృష్ణ, సార్గం సంజీవరెడ్డి మరియు ముగ్గురు రైతులు మంద నర్సింలు, కామిరెడ్డి వెంకటస్వామి రెడ్డి,ఎస్ కే బాబు మియా లను సన్మానించారు. ఇట్టి కార్యక్రమశీలో సమన్వయ కర్త అహ్మద్ సైనికులకు రైతులకు స్వాగతం పలికరు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ లక్కంపల్లి సంజీవన్ రావు, బోధన్ వ్యాపారవేత్త షికారి గంగాధర్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు తోట శ్రీకాంత్, స్వచ్ఛంద సేవకులు రేఖ గిరిధర్ , సామాజిక కార్యకర్త చల్ల గంగాధర్, ఆర్గానిక్ వ్యవసాయంలో విశేష కృషి చేస్తున్న మాజీ సైనికుడు వ్యవసాయ దారుడు, వడ్డేపల్లి జై జవాన్ ఆగ్రో ఫారం నిర్వాహకులు నవీన్ కుమార్ పాల్గొన్నారు. టిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ తాటి వీరేశం మాట్లాడుతూ అమ్మ నాన్నల ఆశీర్వాదంతో సామాజిక సహకారంతో ఇంతవరకు 106 మంది సైనికులను, 106 మంది రైతులను ,వారి వారి ప్రాంతాలలో సన్మానం. చేశామన్నారు, ప్రజలలో దేశభక్తి పెంపొందించుట వారి సేవకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపినారు.



# బడులలో అసంపూర్తి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలి

**- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెడతాం- వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలి**





నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 17 (డీ కే చాటింపు): ప్రభుత్వ విద్యా సంస్థలలో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగు పర్చేందుకు వీలుగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్టేట్ చాంబర్ లో సోమవారం ఆయన కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అసంపూర్తి పనులను గుర్తించి, విద్యార్థులు సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎక్కడ కూడా తాగునీరు, టాయిలెట్స్ వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రయోజనాల విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, నూటికి నూరు శాతం పనులు నాణ్యతతో జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ లను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల విషయమైఉన్నతాధికారులను సంప్రదించి మంజూరు చేయిస్తానని తెలిపారు. అయితే పనులను పూర్తి చేయించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని హితవు పలికారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు, మరమ్మతుల కోసం వీబీజీరాంజీ పథకం కింద ప్రతిపాదనలు పంపాలని, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు వారం రోజుల్లోపు ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్వయం సహాయక సంఘాల ద్వారా యూనిఫాంలను వేగవంతంగా కుట్టించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉన్న బడులలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బోధకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేలా కృషి చేయాలి అన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరును సమీక్షిస్తూ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత మంది నుండి ఏమేరకు బకాయిలు రాబట్టగలిగారు, ఇంకా ఎంత మంది సీ.ఎం.ఆర్ కు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు సముఖంగా ఉన్నారు తదితర వివరాలను ఆరా తీశారు. బకాయిలు చెల్లించని మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, రెవెన్యూ రికవరీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పంచాయతీ శాఖ పనితీరును సమీక్షిస్తూ, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం పనులు, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా రోజువారీగా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధి లోనూ ఇంటింటి చెత్తను వెంటదివెంట తరలించేందుకు వీలుగా డంపింగ్ యార్డ్ మల్టిపుల్ పాయింట్స్ ను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు సూచించారు. సమీక్షా సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, డీ.ఈ.ఓ పి.అశోక్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



**ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు**

# ఎల్బీనగర్ రింగు రోడ్డు మీద ధర్నా కార్యక్రమం




ఎల్బీనగర్, ఆగష్టు 17 (డీకే చాటింపు) పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందని ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు అన్నారు. కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలి:ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళలు.సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద ఎల్బీనగర్ నియోజకవర్గం మహిళ నాయకురాలు కాంగ్రెస్ ప్రభుత్వం పై విరుచుకుపడ్డారు.దానిలో భాగంగా రోడ్డుమీద ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు.కళ్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు.ముఖ్యమంత్రి,మంత్రుల అవినీతి అంశాల్లో కోట్ల రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం ఈ అంశంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదని అన్నారు.తెలంగాణ ఆడబిడ్డలు,వారి కుటుంబాల తరఫున బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీని నిలదీస్తుంది అని అన్నారు.ఆడబిడ్డల తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కళ్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్ర చేస్తుంది అని అన్నారు.పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి,ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మహిళలు మండిపడ్డారు.హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు.కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని,తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు,ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పడిన వెంటనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు.రూ. 51 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని దశలవారీగా రూ.75,116కు,అనంతరం రూ.1,00,116కు పెంచారని తెలిపారు.కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందిందన్నారు.కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.అయితే ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానినే రద్దు చేసేందుకు ప్రయత్నిస్తోందని మహిళలు విమర్శించారు.కళ్యాణ లక్ష్మి కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఆడబిడ్డ ఇప్పుడు ఎన్నికల హామీ ప్రకారం తులం బంగారం కూడా డిమాండ్ చేస్తుండటంతో ఆ ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి ఎంత దారుణంగా మారిందో
అర్హులైన లబ్ధిదారులే చెబుతున్నారని అన్నారు.పెళ్లిళ్లు జరిగి చాలా కాలం గడిచినా, కొందరికి పిల్లలు పుట్టినా కూడా తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి సహాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ధ్వజమెత్తారు.చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు,భారస పార్టీ సీనియర్ మహిళలు శైలజ,రమాదేవి,దేవి,రాధిక,విజయలక్ష్మి,శ్రీలత, కల్పన,వసంత,లక్ష్మి,వాణి తదితరులు పాల్గొన్నారు

**మండల స్థాయిలో**

# ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం

**-నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక... -కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్...**





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట జిల్లాలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్య కలాపాలను పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ,ఎంపీడీవో విజయలక్ష్మి,ఎంఈవో బాలాజీ,వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి పలు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.గత సర్పంచులు చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఉట్కూరు మండలంలో ఫిర్యాదు చేశారు.అలాగే మరికల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అక్రమంగా కరాటే బెల్ట్ పేరిట అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు చేశారు.దామరగిద్ద మండలం బాపన్ పల్లి సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ బాపన్ పల్లి గ్రామంలో డ్రైనేజీ,రోడ్డు విస్తరణ పనులపై అధికారులకు ఓ వినితి పత్రాన్ని అందజేశారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**-మక్తల్ నివాసి గోవర్ధన్ తన కుమారుని జన్మదినోత్సవం సందర్భంగా... -48వ,రోజుకు చేరిన అన్నదాన కార్యక్రమం... -దాతల సహకారంతో ప్రతినిత్యం అన్నదానం... -నారాయణపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్...**

నారాయణపేట,(డీకే చాటింపు): లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట (320A) ఆధ్వర్యంలో సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో ఉచిత భోజన సేవా(ఆకలి నిర్మూలన-ఒక ప్రపంచవ్యాప్త సేవా కార్యక్రమం) కార్యక్రమాన్ని నిర్వహించారు.2026-27వ,సంవత్సరంలో ఉచిత అన్నదాన కార్యక్రమం సోమవారం (48వ,రోజుకు చేరింది) ఈరోజు 350 మందికి ఉచిత భోజనం అందించడం జరిగిందని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ తెలిపారు.మక్తల్ నివాసి గోవర్ధన్ తన కుమారుని జన్మదినోత్సవం సందర్భంగా ఈ భోజన కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరించారని లయన్ రవి కుమార్ గౌడ్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవి కుమార్ గౌడ్, సభ్యులు లయన్ మోహన్ కుమార్ కోనా,లయన్ రాజేష్ పొలేపల్లి,లయన్ హరి నారాయణ బట్టాడ్,లయన్ కన్న జగదీష్,లయన్ శ్రీనివాస్ లహోటి,లయన్ కృష్ణమూర్తి,లయన్ భీమ్ చందర్ గౌడ్,లయన్ డాక్టర్ ఆంజనేయులు,లయన్



ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొని తమ సహకారాన్ని అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# స్థానిక ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ.. కూటమి ప్లాన్ అదుర్స్



**విజయవాడ,** : కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధపడుతోంది. సాధారణంగా పంచాయతీ ఎన్నికలు అనేవి ముందుగా జరపడం సహజం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మున్సిపల్ ఎన్నికల వైపు మొగ్గు చూపింది. ముందుగా పట్టణాల్లో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించింది. దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. 100కు పైగా మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లను కైవసం చేసుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కోలుకోలేని దెబ్బతీయాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చావు దెబ్బ తీసేందుకు ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు కూటమి అడుగులు వేస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ప్రాదేశిక.. చివరిగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది.పట్టణాల్లో విద్యాధికులు, ఉద్యోగ ఉపాధ్యాయులు అధికంగా ఉంటారు. అయితే వారిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ఒక రకమైన వ్యతిరేక భావన ఉంది. పైగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలు కూడా పట్టణ ప్రాంత ప్రజలకు నచ్చడం లేదు. ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కూడా మింగుడు పడడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం వంటి కారణాలతో వైసిపికి ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. ఆపై స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు ఇటీవల వరకు కొనసాగారు. వారు పట్టు నిలుపుకుంటూ వచ్చారు. అందుకే ముందుగా పంచాయితీలకు ఎన్నికలు నిర్వహిస్తే కూటమికి కాస్త ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు అనే మాట ఉండకూడదు అని జగన్ సొంత పార్టీ క్యాడర్ను హెచ్చరించారు. అలా చేస్తే పార్టీ నియోజకవర్గ బాధ్యతలను మార్చేస్తానంటూ ఇంచార్జ్‌ను హెచ్చరించారు. అందుకే ముందుగా మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి తర్వాత మిగతా స్థానిక సంస్థలకు నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది.పట్టణాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉండడంతో ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం. పైగా మూడు పార్టీల కలయికతో కూటమి దూకుడుగా ఉంటుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కలిపేందుకు ఏ పార్టీ ముందుకు రాదు. పైగా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అనుసరించిన తీరు ఆ పార్టీ శ్రేణులకు తెలుసు. అధికార పార్టీ ఎలాంటి దూకుడు కనబరుస్తుందో ఆ పార్టీకి తెలియంది కాదు.. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ కొట్టి.. మిగతా ప్రాదేశిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది కూటమి. చివరిగా గ్రామీణ ప్రాంతాలకు ప్రతీకలుగా నిలిచే పంచాయితీలను ఏకపక్షంగా గెలుచుకొని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకునే పరిస్థితి లేకుండా చేయాలన్నది కూటమి ఆలోచన. అందుకే ముందుగా మున్సిపల్ ఎన్నికల వైపు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ నుంచి డిసెంబరు లోపు మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా అర్థం అవుతుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో

# భారత కంపెనీలకు పశ్చిమాసియా మంట...




అమెరికా యుద్ధోన్మాదంతో పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారతీయ కార్పొరేట్ రంగానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ముడిసరుకుల ధరల అస్థిరత, రవాణా ఛార్జీల పెరుగుదల, కరెన్సీ మారకం విలువలో వస్తున్న మార్పుల కారణంగా కంపెనీలు వ్యయ నిర్వహణలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఈ భౌగోళిక రాజకీయ సంక్షోభం దేశీయ వ్యాపార రంగం భవిష్యత్తు ప్రణాళికలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పారిశ్రామిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఐటిసి, పార్లే, బ్లూ స్టార్, డాబర్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఎడబ్ల్యూఎల్ వంటి ప్రముఖ సంస్థలు తమ లాభాల మార్జిన్లపై తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలిపాయి.
పరిస్థితి ఇలాగే కొనసాగితే తయారీదారులు ఉత్పత్తుల ధరలను మరింత పెంచక తప్పదని.. ఇది నేరుగా సాధారణ వినియోగదారుల కొనుగోలు శక్తిపై భారం మోపుతుందని కంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం తాలూకు ప్రభావం రాబోయే రోజుల్లో అన్ని రంగాల మీద పడే అవకాశం ఉందని, ఇది పండుగ సీజన్ షాపింగ్‌ను కూడా ప్రియంగా మార్చవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిసరుకుల ధరల హెచ్చుతగ్గులు, షిప్పింగ్ సమయాల్లో జరుగుతున్న తీవ్రమైన జాప్యం సరఫరా వ్యవస్థ నిర్వహణను క్లిష్టతరం చేస్తున్నాయని ఎడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ ఎండి, సిఇఒ శ్రీకాంత్ కన్వే తెలిపారు. ఈ పరిస్థితులతో తాము ఖర్చుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. రేట్లలో స్థిరత్వం లేకపోవడం వల్ల ఉత్పత్తులకు సరైన ధరలను నిర్ణయించడం కష్టమవుతోందని పార్లే ప్రొడక్ట్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మయాంక్ షా వెల్లడించారు. వ్యయాలను తగ్గించుకోవడానికి ఆయా కంపెనీలు పొదుపు చర్యలకు సంకేతాలు ఇచ్చాయి. ఈ అనిశ్చితి కారణంగా కంపెనీలు తమ మూలధన పెట్టుబడులను వాయిదా వేసే అవకాశం ఉందని బ్లూ స్టార్ ఎండి బి. త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. ఇది కొత్త ఉద్యోగాల సృష్టి, విస్తృత డిమాండ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కష్టతరంగా మారనుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్చులు పెరిగినప్పుడు కంపెనీల మార్జిన్లు, వినియోగదారుల డిమాండ్ రెండూ దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. పశ్చిమాసియాలో దీర్ఘకాలిక సంఘర్షణతో పాటు, రుతుపవనాలపై ప్రభావం చూపే ఎల్నినో పరిస్థితులు తదితర అంశాలు ఆర్థిక వృద్ధిని, ద్రవ్యోల్బణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఐటిసి తన త్రైమాసిక నివేదికలో హెచ్చరించింది.


# కాల్స్‌కు స్టార్ రేటింగ్

టెలికాం సేవల నాణ్యతపై వినియోగదారుల అభిప్రాయాన్ని నేరుగా సేకరించేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన 'మైకాల్' యాప్‌కు భారీ అప్‌డేట్ తీసుకొచ్చింది. కొత్త వెర్షన్‌లో వినియోగదారులు ప్రతి వాయిస్ కాల్ ముగిసిన వెంటనే 1 నుంచి 5 స్టార్‌ల వరకు రేటింగ్ ఇవ్వడంతో పాటు, కాల్ డ్రాప్‌లు, వాయిస్ క్వాలిటీ, నెట్‌వర్క్ సమస్యలు వంటి అంశాలను వెంటనే నివేదించే అవకాశం కల్పించింది.2018లో ప్రారంభమైన తర్వాత 'మైకాల్' యాప్‌కు ఇదే తొలి అప్‌గ్రేడ్ కావడం గమనార్హం. వినియోగదారులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సంబంధిత టెలికాం కంపెనీలతో పంచుకోవడం ద్వారా నెట్‌వర్క్ లోపాలను గుర్తించి, సేవలను మెరుగుపరచేందుకు ఇది ఉపయోగపడుతుందని ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ తెలిపారు.

# తేళ్లతో సరదాగా ఆడుకుందాం..!

## తేళ్లు..తేళ్లు నన్ను కుడతావా...!?

- ఈ ఒక్కరోజు ఎవరికి హాని చేయని తేళ్లు...!
- నాగుల పంచమి పర్వదినం స్పెషల్...!
- కర్ణాటక రాష్ట్రం కందుకూరులో తేళ్ల పంచమి విశిష్టత...!
- ముఖం,నాలుక,చెంప,తల, చేతిపై తేళ్లు పెట్టుకొని తన్మయం చెందిన యువతీ, యువకులు,పిల్లలు...
- కొండమావ్వ గుట్టపైన చిన్న చిన్న రాళ్ల కింద ఉన్న ఎర్ర తేళ్లు...
- భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు... - భక్తులకు అన్నదానం...







**నారాయణపేట,(డీకే చాటింపు): ఒక వైపు భయం..మరో వైపు ఆశ్చర్యం..యువతీ, యువకులు, పిల్లలు చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా కొండమవ్వా గుట్ట పై బండరాల కింద దాగిన తేళ్లను పట్టుకొని వాటితో సరదాగా గడిపిన దృశ్యాలు అలరించాయి. విషపూరితమైన ఈ తేళ్లు ఈ ఒక్కరోజు(నాగుల పంచమి) మాత్రం ఎవరికీ హాని చెయ్యకుండగా వారితో సరదాగా గడపడం విశేషం.!కర్ణాటక రాష్ట్రం యాద్గిర్ జిల్లా కందుకూరు గ్రామంలో ప్రసిద్ధ"తేళ్ల పంచమి"(నాగుల పంచమి రోజున తేళ్లను పూజించడం)వేడుకకు ప్రసిద్ధి చెందింది..!!**







నారాయణపేట జిల్లా సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం కందుకూరు గ్రామ కొండపై కొలువైన కొండమ్మ అవ్వ సన్నిధిలో సోమవారం జరిగిన మహోత్సవంలో భాగంగా భక్తులు కొండమవ్వను దర్శించుకుని నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ కొండపై ఉన్న బండరాలను తొలగించి వాటి కింది భాగంలో ఉన్న తేళ్లను పలువురు ముఖం,నాలుక, చెంప,తల,చేతులు,శరీరంపై ఎక్కడపడితే అక్కడ తేళ్లను పెట్టుకున్నారు.

ఎవరికి హాని చేయని ఈ తేళ్ల దృశ్యాలు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచాయి. నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం కందుకూరు గ్రామంలో తేళ్ల పంచమి వేడుకలను భక్తులు ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నారాయణపేట జిల్లా ప్రజలు తమ గ్రామాల సమీపంలోని పుట్టల దగ్గరకు వెళ్లి పాలు పోసి నాగుల పంచమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించు కుంటే కందుకూరులో మాత్రం భక్తులు కొండమ్మ అవ్వను దర్శించుకున్న తర్వాత కొండపై ఉన్న రాళ్ల కింద ఉన్న తేళ్లను వెతికి పట్టుకొని వాటితో ఎంతో సరదాగా గడిపారు. ఈ దృశ్యాలు అందర్నీ ఎంతో ఆకట్టుకున్నాయి.

**కందుకూరులో తేళ్ల పంచమి వేడుకల విశిష్టత**

కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మీట్కల్ తాలూకా కందుకూరు గ్రామ కొండపై కొలువైన కొండమ్మ అవ్వ సన్నిధిలో తేళ్ల పంచమి వేడుకలో భాగంగా గట్టు మీద కొలువైన కొండమ్మ అవ్వను భక్తులు దర్శించుకున్న తర్వాత చిన్న చిన్న రాళ్ల కింద ఉన్న తేళ్లను పట్టుకొని తలపై, నాలుకపై,ముఖంపై, చేతులపై ఈ విధంగా శరీరంపై ఎక్కడపడితే అక్కడ పెట్టుకుని తన్మయం చెందారు. ఈ కొండపై కొండమ్మ అవ్వ పూజలు ఒకెత్తయితే..భక్తులు తేళ్లను పట్టుకొని శరీరంపై ధరించడం మరో ఎత్తుగా చెప్పవచ్చు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ తేళ్లను చేతితో పట్టుకుని శరీరంపైన పెట్టుకొని ఎంతో ఆనందంగా గడిపారు. భక్తులు శరీరంపై తేళ్లను ఎక్కడ పెట్టుకున్న అవి ఎవరికి హాని చెయ్యకపోవడం విశేషం..! కొండమ్మ అవ్వ మహిమతోనే నాగులపంచమి రోజు తేళ్లు ఎవరికి హాని చేయవని భక్తుల విశ్వాసం.! అక్కడి వాతావరణ పరిస్థితులు, వనమూలికల ప్రభావంతోనే తేళ్లు కుట్టబో వని విద్యావంతులు పేర్కొంటున్నా రు. గట్టు మీద ఉన్న చిన్న చిన్న బండ రాళ్ల కింద ఉన్న ఎర్ర తేళ్లను భక్తులు తమ శరీర భాగాలపై పెట్టుకొని మురిసిపోయారు. మరి కొందరు తేళ్ల కాళ్లకు దారాలు కట్టి వాటితో సరదాగా గడిపారు.

నాగుల పంచమి రోజున పూజలు చేయడం ద్వారా తమకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్న నమ్మకంతో కొండమ్మ అవ్వను దర్శించుకునేం దుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చి అమ్మ వారికి పూజలు నిర్వహించారు. కొండమ్మ అవ్వ గుట్టపై తేళ్లను తాకితే వచ్చే నాగుల పంచమి నాటికి తమ కుటుంబానికి మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. తేళ్లను ఎందరో పట్టుకున్న ఎవరికి హాని చేయని నేపథ్యం అందర్నీ విశేషంగా ఆకట్టుకుంది.

**నాగుల పంచమి రోజు**

**నాగులకు నైవేద్యంగా సమర్పించుకునే పాలు,**

నువ్వులు,బెల్లం తదితర పదార్థాలను తేళ్ల పంచమి రోజున అమ్మవారి గుట్టపై ఉంచి పూజించారు. ఈ పూజల సమయంలో తేళ్లను తాకడం ద్వారాతమకు మేలు జరుగుతుందని భక్తుల విశ్వాసం. కర్ణాటక రాష్ట్ర భక్తులతో పాటు నారాయణపేట జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కొండమ్మ అవ్వను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# బెజవాడలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ




విజయవాడ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద వైసీపీ వర్గాలు నిర్వహిస్తున్న ధర్నాను స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వైసీపీ కార్యకర్తలు ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో టెంట్లు వేసి ధర్నా చేపట్టారు. ఇది అనధికారికమని, ధర్నా చౌక్ వదిలి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్డుపై టెంట్లు వేశారని ఎమ్మెల్యే బోండా ఉమ మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ టెంట్లను తొలగించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. విజయవాడ సెంట్రల్ సహా యాడికి, పొన్నూరులోనూ వైసీపీ ధర్నా చేస్తున్న టెంట్లు తొలగించారు. ఇరు వర్గాలు కుర్చీలు, టమాటాలు, కోడిగుడ్లు విసురుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో దీక్ష చేసే హక్కు లేదా? తమపై దాడులు ఎంత వరకు సబబు, రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని మండిపడ్డాపు వైసీపీ నేత మల్లాది విష్ణు. రాష్ట్రంలో శాంతి, భద్రతలు క్షీణించాయని కేంద్ర ప్రభుత్వం జ్యోక్యం చేసుకుని తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఈ దాడులేంటని ప్రశ్నించారు. చంద్రబాబుపై అనవసర విమర్శలు ఊరుకునేది లేదు - బోండా ఉమధర్నా చేసేందుకు ఇక్కడ అనుమతి లేదు, రోడ్డుపై టెంట్ వేసి ధర్నాలు ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యే బోండా ఉమ. ముఖ్యమంత్రి చంద్రబాబుపై, మంత్రి లోకేష్ పై అనవసర విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు బోండా ఉమ. గత ప్రభుత్వం యువతను మోసం చేసింది..వాళ్లు కల్పించలేని ఉద్యోగాలు ఈ ప్రభుత్వం ఇచ్చిందని స్పష్టం చేశారు బోండా ఉమ. 18వేల మంది డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగం సంపాదిస్తే వారి జీవితాలు నాశనం చేసేందుకు వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. డీఎస్సీ నిర్వహణ, పారదర్శకతపై చర్చించేందుకు రావాలని మంత్రి లోకేష్ సవాల్ విసిరారు..దానిపై చర్చించే దమ్ము, ధైర్యం జగన్ పార్టీ నేతలకు లేదు..ఇంకోసారి అబద్ధాలు ప్రచారం చేస్తే ఇంటికొచ్చి కొడతాం అని హెచ్చరించారు బోండా ఉమ. ధర్నా చౌక్ లో ఆందోళన చేసి ఉంటే తాము అడ్డుకునేవారం కాదని స్పష్టం చేశారు. జుఖీఅఖ దీక్షా శిబిరంపై టీడీపీ వర్గాల దాడి ఘటపై తీవ్రస్థాయితో విరుచుకుపడ్డారు మాజీ మంత్రి పేర్ని నాని. చంద్రబాబు ప్రభుత్వానికి నూకలు చెల్లాయ్..రౌడీయిజానికి ప్రజలు త్వరలోనే సమాధానం చెబుతారు అన్నారు. బోండా ఉమ అధికారమదంతో..మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శిబిరంపై దాడి చేశారని..అధికారపార్టీ నేతలు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. బోండా ఉమ లాంటి వందమంది రౌడీలను పోగేసుకుని చంద్రబాబు, లోకేశ్ శునకానందం పొందినా ఆ ఆనందం ఎన్నో రోజులు నిలవదని, శిశుపాలుడి పాపాల మాదిరిగా లెక్కిస్తున్నారు ప్రజలు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు పేర్ని నాని. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇంటికొచ్చి కొడతాం అని బెదిరిస్తున్నారు..మీకు చేతనైంది చేసుకోండి ఎంతమందిని కొడతారో చూస్తాం అని సవాల్ విసిరారు నాని.

# జగన్ లాయల్టీ కార్డ్...



**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న శైలి హాట్ టాపిక్‌గా మారింది. క్రిమినల్ ఆరోపణలు , కేసులు ఎదుర్కొంటున్న స్వపక్ష నాయకులు, నేరుగా బాధితులను పరామర్శించడానికి బదులుగా, నిందితులు లేదా కేసుల్లో చిక్కుకున్న తన సొంత పార్టీ నాయకులకు బహిరంగ మద్దతు తెలపడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి సీదరి అప్పలరాజు, తమ్మినేని సీతారం, ముస్తఫా, విరూపాక్షి అలాగే పలువురు సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టుల సందర్భాలలో జగన్ ప్రదర్శించిన వైఖరి దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఇది రాజకీయ అవగాహన లేక చేస్తున్న పని కాదని, దీని వెనుక అత్యంత పక్కాగా లెక్కించిన పొలిటికల్ క్యాలిక్యులేషన్ ఉందనేది ఎక్కువ మంది అభిప్రాయం. ఈ వ్యూహంలో మొదటి , అత్యంత ప్రధానమైన అంశం క్యాడర్‌కు లాయల్టీ సిగ్నల్ ఇవ్వడం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రమైన చట్టపరమైన, పోలీసు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న తమ పార్టీ కార్యకర్తలకు మీ వెనుక నేనున్నాను అనే కొండంత అభయాన్ని అందించడం ద్వారా పార్టీ క్యాడర్ చెల్లాచెదురు కాకుండా జగన్ కాపాడుకుంటున్నారు. విపక్షంలో ఉన్నప్పుడు అధినేతే తమ రక్షణకు నిలబడకపోతే ద్వితీయ శ్రేణి నాయకత్వం, గ్రౌండ్ లెవల్ శ్రేణులు ఉత్సాహం కోల్పోతాయి. తప్పు ఒప్పనేది పక్కనబెడితే, నా మనుషుల కోసం నేను ఎంతటి రాజకీయ ఒత్తిడికైనా ఎదురెళ్తాను అనే భావనను క్యాడర్‌లో నూరిపోయడం ద్వారా పార్టీ నిర్మాణం పడిపోకుండా ఆయన వ్యూహాత్మక రక్షణ కవచం నిర్మిస్తున్నారు. అలాగే రెడ్ బుక్ రాజ్యాంగం, రాజకీయ కక్షసాధింపు అనే కౌంటర్ నరేటివ్‌ను సెట్ చేయడం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమ పార్టీ నేతలను రాజకీయ కక్షసాధింపుతోనే కేసుల్లో ఇరికిస్తున్నారని ప్రచారం చేయడం జగన్ వ్యూహంలో భాగం. ఏ కేసు వచ్చినా, దానిని తీవ్రమైన నేరంగా చూడకుండా పాలనా యంత్రాంగం, పోలీసు వ్యవస్థల దుర్వినియోగంగా వర్గీకరించడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించే యత్నం చేస్తున్నారు. తద్వారా నిందితుడిని నిందితుడిగా కాకుండా రాజకీయ బాధితుడిగా ప్రజల్లో ప్రొజెక్ట్ చేసేందుకు వైఎస్సార్‌సీపీ మీడియా , సోషల్ మీడియా వేదికలను వినియోగిస్తున్నారు. అదే సమయంలో బిసి, సామాజికవర్గ సమీకరణల రక్షణ కూడా చూస్తున్నారు. సీదరి అప్పలరాజు కేసునే ఉదాహరణగా తీసుకుంటే, ఆయన్ను ఉత్తరాంధ్ర బిసి నేతగా ప్రొజెక్ట్ చేస్తూ ప్రభుత్వం బిసిలపై వేధింపులకు దిగుతోందనే కార్డ్‌ను ప్రయోగించారు. తద్వారా మూల నేరం లేదా కేసులోని అసలు నిజానిజాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి, దానిని సామాజిక వర్గాల పోరుగా లేదా అధికారిక దమనకాండగా మార్చడంలో జగన్ రాజకీయవ్యూహాలు పన్నుతున్నారు. ఇలాగే అంబటి రాంబాబు, విరూపాక్షి వంటి నేతల విషయంలోనూ జరిగింది. ఇటువంటి ఎత్తుగడలు తాత్కాలికంగా కోర్టులు లేదా మీడియా ఇచ్చే సమాధానాలకు అతీతంగా, వారి సొంత ఓటు బ్యాంకులో మా నేతను తొక్కుతున్నారు అనే సెంటిమెంట్‌ను రగిలిస్తాయి. అయితే, ఈ రాజకీయ లెక్కల్లో ఉన్న అత్యంత ప్రమాదకరమైన మైనస్ పాయింట్ న్యూట్రల్ ఓటర్లలో తీవ్రమైన ప్రతికూలత . సామాన్య ప్రజలు, మధ్యతరగతి , విద్యాధికులు న్యాయం వైపు లేదా బాధితుల వైపు నిలబడటాన్ని ఆశిస్తారు. తప్పు చేసిన వారికి, లేదా హిట్ అండ్ రన్ కేసుల్లో రక్షణగా నిలిచారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పార్టీ అధినేతే స్వయంగా వెళ్ళి అండగా నిలవడం సమాజానికి తప్పు సంకేతాలు పంపుతుందని, నేరస్థులకు రాజకీయం అభయహస్తం ఇస్తోందనే భావన బలపడుతుందని అధికార పార్టీ విమర్శిస్తోంది. వైఎస్ జగన్ చేస్తున్న ఈ రాజకీయ కసరత్తు అంతా తమ కోర్ ఓటు బ్యాంక్ , క్యాడర్ రీటెన్షన్ కోసమే. న్యూట్రల్ ఓటర్ల ఆగ్రహం కంటే, పార్టీ శ్రేణులు భయపడి పక్కకు తప్పుకోకుండా ఉండటమే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్సార్‌సీపీకి అత్యంత కీలకమైన మనుగడ ప్రశ్నగా ఆయన భావిస్తున్నారు. తన మనుషుల కోసం నిలబడే నేతగా గుర్తింపు తెచ్చుకోవాలనే జగన్ మార్క్ హై-స్టేక్స్ పొలిటికల్ గేమ్‌లో ఇది ఒక భాగమే తప్ప, ఆయనకు రాజకీయ జ్ఞానం లేక చేస్తున్న పొరపాటు మాత్రం కాదని అనుకోవచ్చు.

# నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా



**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ - నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు. అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ - నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్-మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ - నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# టార్గెట్ లోకేష్..

## డీఎస్సీపైనే వైసీపీ పోరాటం

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయం ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాలతో కొత్త మలుపు తిరగనుంది. ఇటీవల కాలంలో అధికార కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సమరశంఖం పూరిస్తూ వరుస ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. అందులో ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాలపై అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయంటూ నిర్వహించిన నిరసనలు, సమావేశాలు, రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వీధుల్లో పోరాడిన వైఎస్సార్‌సీపీకి, అభియోగాల్లో నిజాయితీ ఉంటే అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రత్యక్ష చర్చకు దిగాలి అని అధికార పక్షం విసిరిన చాలెంజ్ ఇప్పుడు ప్రధాన రాజకీయ పరీక్షగా మారింది. మెగా డీఎస్సీ వివాదంపై పారదర్శకమైన చర్చ జరపాలనే విజ్ఞప్తులతో వైఎస్సార్‌సీపీ నేతలు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చడం ప్రతిపక్షానికి ఊహించని చట్టపరమైన షాక్‌గా మారింది. రాజకీయ లబ్ధి కోసం వేసే పిల్‌లను అనుమతించలేమని న్యాయస్థానం స్పష్టం చేయడంతో, ఈ అంశాన్ని న్యాయపోరాటం కంటే సభా వేదికగానే తేల్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తమ పారదర్శకతను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతుండటంతో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ వేదికను వాడుకుంటుందా లేదా అనే అంశంపై సోషల్ మీడియా, రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరందుకున్నాయి. అసెంబ్లీకి హాజరయ్యే విషయంలో వైఎస్సార్‌సీపీ ముందున్న అతిపెద్ద సవాలు ప్రతిపక్ష హోదా గుర్తింపు . తగినంత సంఖ్యాబలం లేదన్న కారణంతో స్పీకర్ స్థానం ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో వైఎస్సార్‌సీపీ గత సమావేశాలను బహిష్కరించింది. అయితే, ఇప్పుడు డీఎస్సీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన ఉద్యమం చేతిలో ఉండటంతో, నిరసనను సభ బయటకే పరిమితం చేస్తే.. ప్రభుత్వ సవాల్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే వైఎస్సార్‌సీపీ పారిపోయింది అని అధికార పక్షం ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మరోవైపు, అధికార కూటమి నేతలు సైతం శాసనసభ వేదికగా ప్రతిపక్షాన్ని గణాంకాలతో నిలదీసేందుకు పక్కా నివేదికలతో సిద్ధమవుతున్నారు. తమ ప్రభుత్వంలో కల్పించిన ఉద్యోగ అవకాశాలు,

స్పోర్ట్స్ కోటా పరిశీలన పద్ధతులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సభ ముందు ఉంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే డీఎస్సీతో పాటు శాంతిభద్రతల అంశం, ఇటీవల ఎమ్మెల్యేల అరెస్టుల వ్యవహారాలపై ఉభయ పక్షాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ముందు ప్రస్తుతం రెండు మార్గాలు మిగిలాయి.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు.

బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948–49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు.

ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో

గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు.

భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరెక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు.

# సడెన్ షాకిచ్చిన బంగారం ధరలు.. ఒక్కరోజే రూ.10,000 పెరిగిన వెండి..



**ముంబై,** : భారత ప్రజలకు బంగారం అంటే చాలా ఇష్టం. ఏడాది పొడవునా కొంటూనే ఉంటారు. ఇక పెళ్లిళ్లు, పండగలు, పర్వదినాల్లో బంగారం, వెండి కొనుగోళ్లు భారీగా జరుగుతుంది. ప్రస్తుతం ఆషాఢం, శ్రావణ మాసం సేల్స్ జరుగుతున్నాయి. త్వరలోనే పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుంది. దీంతో బంగారం కొనుగోళ్లు మళ్లీ భారీగా జరగనున్నాయి. ఈ తరుణంలో పసిడి రేట్లు భారీగా పెరుగుతూ కొనుగోలుదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మళ్లీ తులం బంగారం రేటు రికార్డ్ గరిష్ఠాల వైపు పరుగులు పెడుతోంది.క్రితం రోజు తగ్గినట్లే కనిపించి పసిడి ధరలు ఇవాళ ఒక్కసారిగా పెరిగాయి. ఇక కిలో వెండి రేటు అయితే రూ.10 వేల మేర దూసుకెళ్లింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో పాటు ఉక్రెయిన్‌పై రష్యా దాడులు చేయడం, డాలర్ విలువ, ఫెడ్ వడ్డీ రేట్ల అంచనాల వంటి కీలక అంశాలు బంగారం ధరలపై ప్రభావ చూపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో న రేట్లు తెలుసుకుందాం.అంతర్జాతీయ మార్కెట్లలో ఈరోజు పసిడి ధరలు భారీగా పెరిగాయి. స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 42 డాలర్లకు పైగా పెరిగింది. దీంతో ఔన్స్ బంగారం ధర 4403 డాలర్లు దాటి ట్రేడవుతోంది. అలాగే స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 0.16 శాతం పెరిగి 65.17 డాలర్ల వద్ద అమ్ముడవుతోంది.

హైదరాబాద్‌లో బంగారం ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పసిడి ధరలు ఒక్కరోజులోనే మారిపోయాయి. నిన్నటి రోజున తగ్గిన బంగారం ధర ఈరోజు భారీగా పెరిగింది. ఇవాళ 24 క్యారెట్ల మేలిమి గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ.1850 మేర పెరిగింది. దీంతో తులం రేటు రూ.1,53,820 వద్దకు ఎగబాకింది. అలాగే 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు తులానికి రూ.1700 మేర పెరిగి రూ.1,41,000 మార్క్ దాటింది.

విజయవాడలో బంగారం ధరలు

ఆంధ్రాలోని ప్రధాన నగరాల్లో ఒకటైన బెజవాడలో ఈరోజు పసిడి రేట్లు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం రేటు తులానికి రూ.1850 పెరగడంతో రూ.1,53,820 వద్దకు చేరింది. అలాగే 22 క్యారెట్ల పసిడి రేటు తులంపై రూ.1700 ఎగబాకి రూ.1,41,000 వద్దకు దూసుకెళ్లింది.గత కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతూ వచ్చిన వెండి రేటు ఒక్కసారిగా పెరిగింది. దాదాపు వారం తర్వాత సిల్వర్ రేటులో మార్పు కనిపించింది. ఈరోజు హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో కిలో వెండి రేటు ఏకంగా రూ.10,000 పెరిగింది. దీంతో కిలో సిల్వర్ ధర రూ.2,60,000 మార్క్ వద్దకు దూసుకెళ్లింది.

# జైపూర్ కృత్రిమ కాలు సృష్టికర్త సేథీ....

తెలుగు చలన చిత్ర రంగంలో ఒక మరుపురాని అద్భుత చిత్రరాజం మయూరి. ఆ రోజుల్లో ఆ సినిమా ఒక సంచలనం. సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించగా, 1985లో విడుదల చేసిన చిత్రం. నర్తకియైన సుధా చంద్రన్ నిజ జీవితం ఆధారంగా సహజత్వం ఉట్టిపడేలా తీసిన చిత్రం. ప్రమాదం కారణంగా ఒక కాలు కోల్పోయిన స్థితిలో,

నిరాశ నిస్పృహలకు లోను కాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్ట పడి సాధన చేసి, కృత్రిమ కాలు తోనే నాట్య ప్రదర్శనలు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాట్య మయూరి జీవితమే ఆ సినిమా కథ నేపథ్యం. ఆ నర్తకే సుధా చంద్రన్. ఆమె జీవిత నేపథ్యమే మయూరి సినిమా కథా వస్తువు. ఆ సినిమాలో మయూరి పాత్ర పోషించింది స్వయాన సుధా చంద్రన్ కావడమే విశేషం. సుధా చంద్రన్ జైపూర్ వెళ్ళి కృత్రిమ కాలును అమర్చు కోవడాన్ని మయూరి సినిమాలో చూస్తాం. ఆ కృత్రిమ పాదం, కాలు రూపకర్త ఎవరో చాలా మందికి తెలియదు.

ఆయనే... కాళ్ళు కోల్పోయిన ఎందరికో, కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన, దేశం గర్వించ దగిన ప్రముఖ శస్త్ర వైద్యుడు పి.కె.సేథీగా పేరెన్నిక గన్న ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమోద్ కరణ్ సేథీ (నవంబర్ 28, 1927 – జనవరి 7, 2007) భారతీయ శస్త్ర వైద్యుడు, జైపూర్ కృత్రిమ పాదం

(జైపూర్ ఫూట్) సృష్టికర్త. 1927, నవంబర్ 28 న ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జన్మించాడు. కాళ్ళు కోల్పోయిన అనేక మందికి కృత్రిమ కాలు అమర్చి ఎందరికో నడక నేర్పిన సేథీ గిన్నిస్ బుక్ రికార్డులో కూడా నమోదు కా బడి, ప్రశంసాపత్రం అందుకున్నాడు. 1981లో సామా జిక సేవా రంగంలో ఆసియా లోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా అయన పొందాడు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిం చి పద్మశ్రీ పురస్కారంతో సత్కరిం చింది.

# అరుణాచల్‌లోకి అక్రమంగా
# చైనా బలగాలు డ్రాగన్‌కు భారత్ వార్నింగ్

**ఇటానగర్,** : అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు తరుచూ కొత్త పేర్లు సూచిస్తూ.. కవ్వింపులకు పాల్పడుతోంది పొరుగు దేశం చైనా. ఇటీవల చైనాకు గట్టి కౌంటర్ ఇస్తూ 27 ప్రాంతాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. దీనిపై డ్రాగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇది చట్టవిరుద్ధమని వాదిస్తోంది. అయితే, ఈ వాదనలను భారత్ తిప్పికొట్టింది. అరుణాచల్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించింది. అంతేకాదు, సరిహద్దుల్లో పరిస్థితులనే ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని భారత్ స్పష్టం చేసింది.ఈశాన్య సరిహద్దుల్లోని అరుణాచల్ ప్రదేశ్ అప్పర్ సుబాన్సిరి జిల్లాలోకి చైనా దళాలు అక్రమంగా చొరబడ్డాయనే నివేదికలపై భారత్ తీవ్రంగా స్పందించింది. సరిహద్దుల్లో నెలకొనే పరిస్థితులే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఈ మేరకు భారత విదేశాంగ స్పష్టం చేసింది. స్థానికులను ఉటంకిస్తూ ఇటీవల వచ్చిన కథనాల ప్రకారం... చైనా బలగాలు వాస్తవాధీన రేఖను దాటి టాక్సింగ్ సర్కిల్‌లోని పుకార్ లా, ఒల్లాలోకి ప్రవేశించినట్టు వార్తలు వెలువడ్డాయి. నివేదికలపై అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండూ గతవారం మాట్లాడుతూ.. ప్రచారాన్ని ఖండించారు. అంతేకాదు, ఆర్మీ, స్థానిక సంస్థలతో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకుంటానని అన్నారు.భారత భూభాగాన్ని మన సైన్యం ఎంతో సమర్థవంతంగా పరిరక్షిస్తోందని, కాబట్టి ఎలాంటి చొరబాటు జరగలేదని భావిస్తున్నానని పెమా ఖండూ అన్నారు. అయితే, మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌ను దీనిపై ప్రశ్నించగా.. సరిహద్దుల్లో శాంతిభద్రతలను కాపాడటమే అత్యంత కీలమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఇటీవల సరిహద్దు అంశంపై జరిగిన దౌత్యపరమైన చర్చల వివరాలను ఆయన వెల్లడించారు.

బోర్డర్‌లో శాంతి ముఖ్యం

“భారత్–చైనా సరిహద్దుకు సంబంధించిన సమస్యను ఎప్పుడూ అత్యంత తీవ్రమైనవిగా పరిగణిస్తాం... ఈ విషయాన్ని చైనా పక్షంతో జరిగిన చర్చల్లోనూ స్పష్టం చేశాం.. అక్కడ శాంతి, ప్రశాంతత నెలకొనడం అత్యంత ముఖ్యం.. సరిహద్దుల్లోని పరిస్థితులే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని ప్రతిబింబిస్తాయని మేము తెగేసి చెప్పాం” అని జైస్వాల్ అన్నారు.“ఇటీవల ఆగస్టు 6 జరిగిన భారత్–చైనా సరిహద్దు వ్యవహారాలపై సంప్రదింపులు, సమన్వయం కోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ మెకానిజం 36వ సమావేశంలో కూడా ఈ విషయాన్ని పునరుద్ఘాటించాం.... ఈ సమావేశంలో ఇరువర్గాలు వాస్తవాధీన రేఖ వెంబడి ఉన్న పరిస్థితిని సమీక్షించాయి. ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అభివృద్ధికి సరిహద్దు ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడటం అత్యవసరమని భారత పక్షం మరోసారి నొక్కిచెప్పింది” అని ఆయన పేర్కొన్నారు.సరిహద్దుల్లో ఎలాంటి అపోహలు, అపార్థాలకు తావులేకుండా డబ్ల్యూఎంసీసీ స్థానిక కమాండర్ స్థాయి సమావేశాలతో పాటు దౌత్య, సైనిక మార్గాలను ఉపయోగించుకోవడానికి ఇరుదేశాలు అంగీకరించాయని రణధీర్ జైస్వాల్ చెప్పారు.

భారత్‌లో విడదీయరాని భాగం

అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పేర్లు పెట్టే ప్రయత్నాలను తిప్పికొడుతూ గత వారం భారత్ 27 ప్రాంతాలకు భారత అధికారిక మ్యాప్‌లో ప్రామాణిక పేర్లను సూచించింది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. అరుణాచల్ ప్రదేశ్‌ను తాము గుర్తించబోమని వ్యాఖ్యానించింది. “చైనా కాలక్రమేణా ఉపయోగిస్తున్న పేర్లను భారత్ తన సొంత పేర్లతో మార్చడానికి ప్రయత్నించడం చట్టవిరుద్ధం.. చెల్లబాటు కూడా కావు” అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ అన్నారు.చైనా చేసిన ఈ వ్యాఖ్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో విడదీయరాని భాగమని విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పష్టమైన సందేశాన్నిచ్చారు.


# గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు




**హైదరాబాద్,** : తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్ , నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది.ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తెలుతున్నాయి.మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ–వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు గల్లంతైనట్లయితే ఎన్నికల సంఘం కేటాయించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల వ్యవధిలో ఆన్‌లైన్ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లేదా నేరుగా బీఎల్ఓల ద్వారా ఫారమ్–6, ఫారమ్–8 దాఖలు చేసి రీ–ఇన్‌స్టేట్ చేసుకోవచ్చని వెల్లడించారు. రాజకీయ పార్టీలు కూడా క్షేత్రస్థాయిలో ఏజెంట్లను రంగంలోకి దింపి అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేలా చర్యలు వేగవంతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

# 172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ

**న్యూఢిల్లీ,** : భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్–పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ–వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ–వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ–వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డావ్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ–వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ–వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థాన్ పౌరులకు మాత్రం ఈ సదుపాయాన్ని దూరంగా ఉంచారు. పాకిస్థానీ పాస్‌పోర్టు కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ–వీసాలను మంజూరు చేయడం





లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ–పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ–వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్–కేటగిరీలకు ఈ–వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ–వీసాల కోసం దాఖలయ్యే దరఖాస్తుల్లో దాదాపు 95 శాతానికి పైగా అప్లికేషన్లను కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రాసెస్ చేసి అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు. ప్రస్తుతం అట్టారీ వంటి కీలక ల్యాండ్ పోర్టులతో పాటు భోపాల్, తిరుపతి విమానాశ్రయాలకు ఈ–వీసా ఎంట్రీ హోదా దక్కడంతో విదేశీ పర్యాటకులు, వ్యాపారవేత్తలకు రవాణా మరింత సులభతరం కానుంది.

# ఈ కేవైసీ కోసం ఆగస్టు 31లోపు డెడ్ లైన్




**హైదరాబాద్,** : దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆగస్టు 31లోగా ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచిస్తున్నాయి. ఈ గడువులోగా పూర్తి చేయని వినియోగదారులకు భవిష్యత్తులో గ్యాస్ సేవలకు సంబంధించిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సబ్సిడీ, వినియోగదారుల వివరాల ధృవీకరణ, డూప్లికేట్ కనెక్షన్ల నివారణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియను చేపడుతున్నారు. అయితే ఈ కేవైసీ కోసం ప్రత్యేకంగా కేంద్రాలకు వెళ్లకుండా ఇంట్లోనే మొబైల్ ద్వారా కూడా పూర్తి చేయొచ్చు. గ్యాస్ కనెక్షన్లు నిజమైన లబ్ధిదారుల పేర్లలోనే కొనసాగుతున్నాయా..? లేదా అనే విషయాన్ని నిర్ధారించడం కోసమే ఈ ఈ కేవైసీ. ఒకే వ్యక్తి పేరుతో ఒకటి కంటే ఎక్కువ కనెక్షన్లు ఉండటం.. తప్పుడు వివరాలతో కనెక్షన్లు తీసుకోవడం వంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఈ ధ్రువీకరణను చేపడుతున్నాయి. దీంతో అర్హులైన వినియోగదారులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.ఈ కేవైసీ పూర్తి చేయడానికి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లాలంటే కొందరికి ఇబ్బందులు ఉంటాయి. దీంతో ఆ అవసరం లేకుండా ఇంటి నుంచే స్మార్ట్‌ఫోన్ ద్వారా దీనిని పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం మీరు ఏ కంపెనీ గ్యాస్ కనెక్షన్ ఉపయోగిస్తున్నారో దానికి అనుగుణంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా ఆ కంపెనీ వెబ్ సైట్ నుంచి కూడా ఈ ప్రక్రియను చేయొచ్చు.ముందుగా గ్యాస్ కంపెనీ యాప్ డౌన్ లోడ్ చేసుకున్న తరువాత రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ప్రొఫైల్ లేదా మై అకౌంట్ విభాగంలోకి వెళ్లి ‘ఈకేవైసీ లేదా రీ వెరిఫికేషన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ ఆధార్ ఆధారిత ముఖ గుర్తింపు కోసం ఆధార్ ఫేస్ ఆర్ డీ యాప్ ఓపెన్ అవుతుంది. ముఖంపై సరిపడా వెలుతురు ఉండేలా చూసుకుని కెమెరా ద్వారా ఫేస్ స్కాన్ పూర్తి చేయాలి. ధ్రువీకరణ విజయవంతమైతే ఈ కేవైసీ పూర్తయినట్లు స్క్రీన్‌పై సమాచారం కనిపించడంతో పాటు కన్ఫర్మేషన్ మెసేజ్ కూడా వస్తుంది ఫేస్ స్కాన్ చేసే సమయంలో ముఖం స్పష్టంగా కనిపించేలా ఉండాలి. కళ్లద్దాలు, మాస్క్, టోపీ వంటివి తొలగించడం మంచిది. ఇంటర్నెట్ కనెక్షన్ బాగా ఉండాలి. అలాగే ఆధార్‌లో నమోదైన వ్యక్తే స్కాన్ చేయాలి. లేదంటే ధృవీకరణ విఫలమయ్యే అవకాశం ఉంటుంది. చాలా మంది ఒకేసారి ఈ కేవైసీ చేయడానికి ప్రయత్నిస్తే సర్వర్‌పై ఒత్తిడి పెరిగి యాప్ నెమ్మదిగా పనిచేసే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం తొందరగా లేదా రాత్రి సమయంలో ఈ కేవైసీ ప్రయత్నిస్తే ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వినియోగదారులు చెబుతున్నారు.


# నియోపోలీస్ లో ఎకరా 120 కోట్లు...




**హైదరాబాద్,** : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల సమీకరణే లక్ష్యంగా కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి సిద్ధమైంది. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా, గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఖరారు చేశారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు సాగనుంది. మోకిలా, బాచుపల్లి, సూరారం వంటి నివాస ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లను కూడా ఈ-వేలంలో ఉంచారు.

హైదరాబాద్ నగర పరిధిలో భూముల విక్రయాల ద్వారా భారీగా ఆదాయం సమీకరించడమే ధ్యేయంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరొక భారీ ఈ-వేలానికి శ్రీకారం చుట్టింది. అత్యంత ఖరీదైన కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లలో ఉన్న విలువైన భూములతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ ప్లాట్లను విక్రయించడానికి అధికారులు నోటిఫికేషన్ సిద్ధం చేశారు. గతంలో డిసెంబర్ 2025లో నిర్వహించిన నియోపోలిస్ భూముల వేలంలో ఎకరానికి అత్యధికంగా రూ. 131 కోట్లు, రూ. 118 కోట్ల వరకు ధర పలికి హెచ్‌ఎండీఏకి సుమారు రూ. 1000 కోట్ల ఆదాయం సమకూరింది. అంతకుముందు వివిధ దశల్లో చేపట్టిన వేలం పాటల ద్వారా సుమారు రూ. 3,708 కోట్లు వచ్చాయి. గతంలో నమోదైన రికార్డు ధరలను ప్రాతిపదికగా తీసుకుంటూ.. ప్రస్తుతం నియోపోలిస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూభాగానికి కనీస ధరగా ఎకరానికి రూ. 120 కోట్లుగా నిర్ణయించారు. అలాగే గోల్డెన్ మైల్ లేఅవుట్‌లోని 0.70 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 70 కోట్ల ప్రారంభ ధరను నిర్ణయించారు. ఈ ప్రధాన రెండు లేఅవుట్లకు సెప్టెంబర్ 9న ఈ-వేలం జరగనుంది. ఈ వేలం ప్రక్రియ మొత్తం ఆగస్టు 24న ప్రారంభమై సెప్టెంబర్ 9 వరకు కొనసాగనుంది. కోకాపేట్ మాత్రమే కాకుండా నగర శివారులలో ఉన్న పలు రెసిడెన్షియల్ లేఅవుట్లలో కూడా భూములను హెచ్‌ఎండీఏ అమ్మకానికి ఉంచింది. కూకట్‌పల్లి సమీపంలోని హైదరాబాద్ నగర్, మోకిలా, బాచుపల్లి, కొత్తూర్ సమీపంలోని ఇన్ముల్‌నర్వ లేఅవుట్లతో పాటు బైరాగిగూడ, చందానగర్, సూరారం, కాప్రా, కిష్టారెడ్డిపేట్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలంలో విక్రయించనున్నారు. ఈ వేలంలో భాగంగా మోకిలా లేఅవుట్‌లోని 300 నుంచి 500 చదరపు గజాల ప్లాట్లకు చదరపు గజానికి కనీస ధర రూ. 55 వేలు, బాచుపల్లి లేఅవుట్‌లోని ప్లాట్లకు రూ. 45 వేలుగా నిర్ణయించారు. అలాగే సూరారంలో ఉన్న 2,420 చదరపు గజాల ల్యాండ్ పార్సెల్‌కు గజానికి రూ. 75 వేలు, మరో 4,840 చదరపు గజాల ప్లాట్‌కు గజానికి రూ. 55, వేలు అప్‌సెట్ ధరగా ఖరారు చేశారు. క్లియర్ టైటిల్స్ ఉన్న ఈ ప్రభుత్వ భూముల విక్రయానికి బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన వస్తుందని అధికారులు భావిస్తున్నారు

# ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి




**హైదరాబాద్,** : తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ-జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు. కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

# రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..




**హైదరాబాద్,** : రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు. అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది. మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# అమ్మవారి హుండీలో 17 తులాల జర్మన్ సిల్వర్



**హైదరాబాద్,** : లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు పూర్తయింది. బోనాల సందడి ముగిసిన తర్వాత చేపట్టిన లెక్కింపులో నగదుతో పాటు బంగారం, వెండి కానుకలు బయటపడ్డాయి. అయితే ఈసారి హుండీలో లభించిన 170 గ్రాముల జర్మన్ సిల్వర్ ప్రత్యేకంగా ఆకర్షించింది. ఆలయానికి 12 రోజుల వ్యవధిలో వివిధ రూపాల్లో మొత్తం రూ.9,90,726 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో హుండీల ద్వారా రూ.6,26,226 నగదు సమకూరింది. మిగిలిన ఆదాయం ఇతర కానుకలు, పూజా టికెట్లు, కొబ్బరికాయలు, శాంతి కళ్యాణం తదితరాల ద్వారా వచ్చినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా నగదుతో పాటు 0.06 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి, 170 గ్రాముల జర్మన్ సిల్వర్ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా భక్తులు నగదు, బంగారం, వెండి రూపంలో మొక్కులు చెల్లిస్తుంటారు. ఈసారి జర్మన్ సిల్వర్ కూడా హుండీలో లభించడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ జర్మన్ సిల్వర్ సాధారణ వెండి ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుంది. తులం రూ.300 నుంచి రూ.400 మధ్య ఉంటుంది. అంటే 17 తులాలు 300 చొప్పున అనుకుంటే రూ.5100 మాత్రమే. హుండీల లెక్కింపు సమయంలో మరో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. సీజ్ చేసిన నాలుగు హుండీలను అధికారులు తెరిచి కానుకలను లెక్కించారు. అయితే మరో హుండీ లాక్ ఎంత ప్రయత్నించినా తెరుచుకోలేదు. దీంతో చివరకు వెల్డింగ్ మిషన్ సహాయంతో లాక్‌ను కట్ చేసి హుండీని తెరిచి లెక్కింపు పూర్తి చేశారు. లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తాజాగా హుండీల లెక్కింపు పూర్తి కావడంతో 12 రోజుల ఆలయ ఆదాయ వివరాలను అధికారులు వెల్లడించారు.

# సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు



**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

8 చొప్పున ఎంపీలున్నా కాంగ్రెస్, బీజేపీ సున్నానే..

కేంద్ర ప్రభుత్వం స్వయంగా అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులను రద్దు చేయాలని వారి భాగస్వామ్య పక్షాలు కోరుతుంటే బీజేపీ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం, సీతారామ, పాలమూరు రంగారెడ్డి, మిషన్ కాకతీయ వంటి ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు తాము ఎంతో కృషి చేశామని కేటీఆర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను తుంగలో తొక్కాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టుల విషయంలో తాము ఎప్పుడూ అడ్డుపడలేదని, కానీ ఇప్పుడు తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఒకవేళ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా జల ఉద్యమం చేపడతామని, అవసరమైతే జలసౌధను ముట్టడించి రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ నుండి 8 మంది బీజేపీ, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను గెలిపించినా రాష్ట్రానికి జరిగిన మేలు 'సున్నా' (8+8=0) అని విమర్శించారు. పొరుగు రాష్ట్రాల్లోని కెన్- బెత్వా, పోలవరం, అప్పర్ భద్ర వంటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించినప్పటికీ, పదేళ్లుగా కోరుతున్నా కాళేశ్వరం లేదా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు మాత్రం ఆ హోదా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని స్పష్టంగా చెప్పినా, ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కనీసం నోరు మెదపకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు. గతంలో పాలమూరు బహిరంగ సభలో బీజేపీ ఇచ్చిన హామీలను కూడా నిలదీయలేకపోతున్నారని, దీనికి కారణం అక్కడ గులాబీ కండువా కప్పుకున్న బీఆర్‌ఎస్ ఎంపీలు లేకపోవడమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం రాజీ లేకుండా పోరాడేది కేవలం బీఆర్‌ఎస్ మాత్రమేనని, భవిష్యత్తులోనైనా రాష్ట్రం కోసం పోరాడే వారినే ఎన్నుకోవాలని ప్రజలను, రైతులను ఆయన కోరారు

# మెయినాబాద్ లో 200 కోట్లతో పూలు, కూరగాయలు మార్కెట్



**హైదరాబాద్ :** హైదరాబాద్ శివారులో రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్‌లో మొత్తం 39.07 ఎకరాలను మార్కెటింగ్ శాఖకు కేటాయించింది. మార్కెట్‌లో శీతల గిడ్డంగులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్, భారీ భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు. ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంగా ఉండటం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉత్పత్తుల రవాణా, దేశీయ, విదేశీ ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ శివారులో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ పూలు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతోపాటు, పూలు కూరగాయల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ మార్కెట్‌ను నిర్మించనున్నారు. ఇందుకోసం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో 39.07 ఎకరాల భూమిని కేటాయించారు. మార్కెట్ నిర్మాణానికి సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 176/పీలో 23.22 ఎకరాలు, హిమాయత్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్ 151/పీలో 15.25 ఎకరాలు కలిపి మొత్తం 39.07 ఎకరాలను రెవెన్యూ శాఖ మార్కెటింగ్ శాఖకు బదలాయించింది. భూమి బదలాయింపు పూర్తవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపకల్పనపై కసరత్తు ప్రారంభించారు. మార్కెట్ నిర్మాణం, విస్తీర్ణం, మౌలిక వసతులు, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలు తదితర అంశాలను డీపీఆర్‌లో పొందుపరచనున్నారు. దేశంలో పూల వ్యాపారానికి ప్రసిద్ధి చెందిన బెంగళూరులోని కృష్ణరాజేంద్ర మార్కెట్‌ను అధికారులు ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సమాచారం. అక్కడి మార్కెట్ పనితీరును పరిశీలించిన అధికారులు.. దానికంటే పెద్దదిగా, ఆధునిక సదుపాయాలతో హైదరాబాద్ మార్కెట్‌ను తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించారు. ప్రతిపాదిత మార్కెట్‌లో భారీ మార్కెట్ భవనాలు, ప్రత్యేక విక్రయ వేదికలు, లోడింగ్? అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, శీతల గిడ్డంగులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను వేగంగా తరలించేందుకు అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పూలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండటం వల్ల నాణ్యమైన పూలు, త్వరగా పాడయ్యే కూరగాయలను దేశంలోని ఇతర ప్రాంతాలతోపాటు విదేశీ మార్కెట్లకు కూడా తరలించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో పూలకు ప్రత్యేకంగా పెద్ద మార్కెట్ లేకపోవడంతో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వస్తోంది. హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కూరగాయలతోపాటు పూల విక్రయాలు జరుగుతున్నాయి. ప్రత్యేక మార్కెట్ ఏర్పాటైతే వేలం, ధర నిర్ణయం, నిల్వ, రవాణా వంటి వ్యవస్థలు ఒకే చోట అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల రైతులకు మార్కెట్ సమాచారం, మెరుగైన ధరలు లభించడంతోపాటు పంట నష్టాలు తగ్గే అవకాశం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 4,402 ఎకరాల్లో వివిధ రకాల పూలు, 1.03 లక్షల ఎకరాల్లో కూరగాయలను సాగు చేస్తున్నారు.

వీటిలో దాదాపు 60 శాతం సాగు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లోనే జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. నగరానికి సమీపంలోనే భారీ వినియోగ మార్కెట్ ఉండటం రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ, తగిన మార్కెటింగ్, నిల్వ సదుపాయాలు లేకపోవడంతో

ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండలంలో ప్రతిపాదిత మార్కెట్ పూర్తయితే పూలు, కూరగాయల రైతులకు కొత్త మార్కెట్ వేదికగా మారనుంది.

ఉత్పత్తిదారులు, వ్యాపారులు, హోల్‌సేల్ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను ఒకే వేదికపైకి తీసుకురావడంతో మార్కెటింగ్ వ్యవస్థ మరింత వ్యవస్థీకృతమయ్యే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, హైదరాబాద్ నగరానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల సరఫరాను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలకు ఈ మార్కెట్ కీలకంగా మారనుంది.

# ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు

**హైదరాబాద్:** ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు. గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# వేప ఆకుల నమిలితే శరీరంలో జరిగే మార్పు ఇదే..!




కొన్ని మూలికలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒకేసారి ఎన్నోరకాల వ్యాధులకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. వేప అటువంటి ఆయుర్వేద మూలికలలో ఒకటి. ఇది చర్మం నుండి శరీరం వరకు అనేక ముఖ్యమైన అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం, ఎండాకాలంలో వేప పువ్వులు తినడం వల్ల శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఈ పువ్వులు పిత్తను శాంతపరుస్తాయని చెబుతారు. ఈ కారణంగా, దక్షిణ భారతదేశంలో వేసవి ప్రారంభంలో వీటిని తింటారు. వేపలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, ఇమ్యునోమోడ్యులేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ మూలిక రక్తాన్ని శుద్ధి చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చర్మ ఛాయను మెరుగుపరుస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల కురుపులు, రింగ్‌వా, దురద వంటి చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

వేపను చేదుగా భావిస్తారు. కానీ, ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరమైన ఔషధంగా భావిస్తారు. ఖాళీ కడుపుతో వేప ఆకులను నమలడం ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వేప ఆకులను నమలడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది. చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఇది నోటి కుహరంలోని బ్యాక్టీరియాను చంపి దంతాలు, చిగుళ్ళను బలపరుస్తుంది. వేప తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, ఆమ్లత్వం తగ్గుతుంది. డయాబెటిస్‌లో రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ఇది సహాయకరంగా పరిగణించబడుతుంది. వేప ఆకులు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం శరీరాన్ని లోపలి నుండి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. వేప ఆకులను తినడం వల్ల రక్తంలో చక్కెర, రక్తపోటు, కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆయుర్వేదంలో వేప ఆకులు, పువ్వుల రసం లేదా కషాయాన్ని రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి, శరీరాన్ని శుభ్రపరచడానికి క్రమం తప్పకుండా తీసుకుంటారు. వేపను మాత్రమే కాకుండా కలకండతో కలిపి కూడా తీసుకోవడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఈ రెండు పదార్థాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. వేడి సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. అంతర్గత బలహీనతను తగ్గిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. లేత వేప ఆకులు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి.

## 4-5 కప్పుల కంటే ఎక్కువ టీ తాగుతున్నారా?



చాలా మందికి టీ లేనిది రోజు గడవదు. ఉదయం టీ తాగడంతోనే రోజును ప్రారంభించే వారు చాలా మంది ఉన్నారు. కొందరైతే ఉదయం నాలుగైదు గంటలకే నిద్రలేచి హోటళ్ల వద్దకు వెళ్తుంటారు. అక్కడ టీ తాగితేనే వారికి నమ్మళంగా ఉంటుంది. చాలా మందికి టీ లేనిది రోజు గడవదు. ఉదయం టీ తాగడంతోనే రోజును ప్రారంభించే వారు చాలా మంది ఉన్నారు. కొందరైతే ఉదయం నాలుగైదు గంటలకే నిద్రలేచి హోటళ్ల వద్దకు వెళ్తుంటారు. అక్కడ టీ తాగితేనే వారికి నమ్మళంగా ఉంటుంది.టీని మితంగా తాగడం వల్ల మీరు ఉత్సాహంగా ఉంటారు. టీలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇది మిమ్మల్ని బద్ధకంగా భావిస్తుంది. కానీ కొంతమందికి ప్రతి రెండు, మూడు గంటలకోసారి టీ అవసరం.

## భోజనం తర్వాత తాంబూలం అలవాటు ఉందా?

పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశేష ప్రాముఖ్యత ఉంది. పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి, దుర్వాసనను తొలగించడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. అందుకే ఇంట్లో పెద్ద వాళ్లు భోజనం తర్వాత తమలపాకులను నమలుతారు. తమలపాకులలో ఉండే పోషకాలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ మనసును ప్రశాంతంగా ఉంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉ



ంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్సర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది.

నోటి దుర్వాసన అనేది చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. తమలపాకులను నమలడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో దుర్వాసనకు ప్రధాన కారణమైన హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గిస్తాయి. ఇది అద్భుతమైన సహజ మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.పంటి నొప్పి, చిగుళ్ళలో రక్తస్రావం వంటి సమస్యలకు తమలపాకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తమలపాకులలో విటమిన్ సి ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నమలడం వల్ల చిగుళ్ళు బలపడతాయి. దంత సమస్యలు తొలగిపోతాయి. తమలపాకులలో టానిన్లు, ప్రొపేన్ ఉంటాయి. ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించి ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడంలో సహాయపడతాయి.

## మహిళలకు ఈ నీరు ఒక వరం



మెంతులను కేవలం పోపు దినుసులగానే కాకుండా ఒక సూపర్ ఫుడ్‌గా పరిగణించాలి. ఇందులో శరీరానికి అవసరమైన ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ః6 శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.నానబెట్టిన మెంతులు ఎందుకు?: శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం.. మెంతుల్లోని సాపోనిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు శరీరంలోని వాపును తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి.రాత్రంతా మెంతి గింజలను నీటిలో నానబెట్టి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగి, గింజలను నమలడం వల్ల పోషకాలు నేరుగా రక్తంలోకి చేరుతాయి.గుండె – జీర్ణక్రియ: చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ పెంచడంలో మెంతులు సహాయపడతాయి. ఇది ధమనులలో అడ్డంకులను తొలగించి గుండెను పదిలంగా ఉంచుతుంది. అంతేకాకుండా మెంతి నీరు తాగడం వల్ల గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి.

## దక్షిణాదిలో సమయం ఇచ్చేవారు కాదు...



మిల్కీ బ్యూటీ తమన్నా తన సినీ ప్రయాణంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. డ్యాన్స్ అనేది తాను సాధన చేసి నేర్చుకున్నది కాదని, దక్షిణాది చిత్ర పరిశ్రమలో నెట్టుకురావడానికి అదొక ఆయుధంగా మారిందని ఆమె తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. దక్షిణాది సినిమాల్లో భారీ పాటల చిత్రీకరణకు తనకు సమయం దొరికేది కాదని తెలిపారు."నేనెప్పుడూ క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకోలేదు. దానికోసం ఎలాంటి సాధనా చేయలేదు. నేను టీనేజ్‌లో దక్షిణాది చిత్రాల్లో నటిస్తున్నప్పుడు పాటల చిత్రీకరణకు సమయం ఇచ్చేవారు కాదు. భారీ సెట్స్ వేసి వందలాది మంది నాకోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఆ సమయంలో భయపడేందుకు కూడా నాకు తీరిక కూడా ఉండేది కాదు. అప్పటికప్పుడు డ్యాన్స్ నేర్చుకుని స్టెప్పులు వేసేదాన్ని. నాకు డ్యాన్స్ అలా వచ్చిందే. ప్రత్యేకంగా నేను శిక్షణ తీసుకోలేదు'' అని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో రాబోతున్న ఓ సిరీస్‌లోని 'గఫూర్' పాట కోసం తమన్నా పనిచేశారు. అదే సమయంలో 'రేంజర్' చిత్రంలోనూ నటించారు. రెండు ప్రాజెక్టుల మధ్య తాను పడిన కష్టాన్ని ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. "ఆ సమయంలో నాకు రోజుకు కేవలం ఆరు గంటల నిద్రే ఉండేది. 'రేంజర్' పాట షూటింగ్ ముగించుకుని వెంటనే 'గఫూర్' పాటకు వెళ్లేదాన్ని. కనీసం రిహార్సల్స్ చేయడానికి కూడా సమయం ఉండేది కాదు. నటనకు ప్రాధాన్యం ఇచ్చే వారు వేరు, డ్యాన్స్ చేసే వారు వేరు అనే అనవసరమైన విభజన ఇప్పుడు ఇండస్ట్రీలో కనిపిస్తోంది. మాధురి దీక్షిత్, శ్రీదేవి, రేఖ లాంటి దిగ్గజ నటీమణులు అద్భుతమైన నటనతో పాటు డ్యాన్స్‌తోనూ మెప్పించారు. నటన, డ్యాన్స్ అనేవి ఒకదానికొకటి తోడుగా ఉండాలి తప్ప, రెండింటినీ వేర్వేరు కోణాల్లో చూడకూడదు. తాత్కాలిక విజయాల కంటే శాశ్వతంగా నిలిచిపోయే మంచి పాత్రలు చేయడమే నా లక్ష్యం.

## దేవుడు కావాలనే ఇలా చేశాడు.. గాయం తర్వాత రష్మిక పోస్ట్

ఇటీవల మైసా సినిమాలో డ్యాన్స్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా తీవ్రంగా గాయపడింది హీరోయిన్ రష్మిక మందన్న. ఆమె 6 వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. వైద్యుల సూచన మేరకు రశ్మిక బెడ్ రెస్ట్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఇన్‌స్టా వేదికగా తన కాలి గాయంపై స్పందించింది. 'గాయాలు అవ్వడం నాకు చాలా చిరాకు తెప్పిస్తుంది.

ఈ గాయం గురించి ఎవరికి తెలియకూడదు అనుకున్నా కానీ తెలిసిపోయింది. నాకు ఇలాంటి గాయం కావడం ఇది మూడవసారి. తుంటికి కాలుని కలిపే టెండన్స్ ఒక్కో వైపు నాలుగు ఉంటాయి. నా కుడి తుంటిలోని ఒక టెండెన్ ఊడిపోయింది. నేను కాలు పైకి ఎత్తాలి అంటే అది మళ్లీ అతుక్కోవాలి.

మైసా సినిమా కోసం డాన్స్ షూట్ చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. నేను చేస్తున్న సినిమాల్లో మైసా అత్యంత కష్టమైన సినిమా. నేను విశ్రాంతి తీసుకోవడానికే దేవుడు ఈ గాయం బారిన పడేలా చేశాడని భావిస్తున్నా' అని అన్నారు. కాగా.. ప్రస్తుతం రష్మిక రణబాలి, మైసా సినిమా షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. వీటితో పాటు మరో రెండు భారీ చిత్రాల్లో నటిస్తున్నారు.



## హీరోగా మారిన మరో యంగ్ నిర్మాత...



యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే నటిస్తున్న లేటెస్ట్ మూవీ సినిమా "మాయలేడి". ఇందులో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయలేడి'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయ్యారు. ఈ సినిమాకు ప్రశంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మధుమిత సర్కార్ హీరోయిన్‌గా నటిస్తోంది. త్వరలోనే ఈ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకురాబోతుండగా.. తాజాగా సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. గ్లింప్స్ చూసినట్లు అయితే.. 'హీరోయిన్ గురించి తెలుసుకున్నా కొద్దీ ఆమె పట్ల హీరోలో మరింత ఆసక్తి పెరుగుతుంటుంది.


## ది వన్ రూల్ వచ్చేసింది..

### మూడో సాంగ్ రిలీజ్ చేసిన సూర్య




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య.. ప్రజెంట్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో బిజీగా ఉన్నాడు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్య దేవర నాగవంశీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మలయాళ కుట్టి మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్‌కు సిద్ధం అవుతుండగా.. ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాను మరింతగా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అంతే కాకోలీవుడ్ స్టార్ హీరో సూర్య.. ప్రజెంట్ 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో బిజీగా ఉన్నాడు.కుండా.. ఇప్పటికే మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేసి రెండు, మూడు సాంగ్స్ సైతం రిలీజ్ చెయ్యగా.. తాజాగా మూడో సింగిల్ రిలీజ్ చేశాడు సూర్య. ఈ మేరకు 'ది వన్ రూల్' అనే పోస్టర్‌ను షేర్ చేసి సినిమాపై మరిన్ని అంచనాలు పెంచేశారు.

## డీప్ ఫేక్‌కు గురైన మృణాల్ ఠాకూర్...



సాంకేతిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ జీవితాన్ని వేగంగా మార్చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. వైద్యం, విద్య, సమాచార రంగాలు, సినిమా పరిశ్రమ వరకు అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా సినిమా సెలబ్రిటీల ఫోటోలు, వీడియోలను మార్చి డీప్‌ఫేక్స్ క్రియేట్ చేయడం ఎక్కువైపోయింది. తమ పేరును, రూపాన్ని కాపాడుకోవడానికి ఇప్పటికే చాలామంది హీరోహీరోయిన్లు కోర్టులకు వెళ్లారు. ఇప్పుడు అదే బాటలో యంగ్ బ్యూటీ మృణాళ్ ఠాకూర్ కూడా తన డీప్‌ఫేక్స్ తయారు చేస్తున్న వారిపై తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి అనుమతి తీసుకోకుండా ఇతరుల రూపాన్ని ఏఐ ద్వారా వాడటం చట్టరీత్యా నేరమని, ఇలాంటి పనులను అస్సలు ఒప్పుకోలేమని మృణాళ్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పష్టం చేశారు. తన రూపాన్ని వాడుతూ డీప్‌ఫేక్ వీడియోలు చేయడం లేదా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. వెంటనే ఈ పనులను ఆపేయాలని, దీన్ని ఒక వార్నింగ్‌గా తీసుకోవాలని ఆమె సూచించారు. ఇకపైనా తన పేరును, రూపాన్ని తప్పుగా వాడితే కచ్చితంగా లీగల్ యాక్షన్ తీసుకుంటానని చాలా ఘాటుగా హెచ్చరించారు.

మృణాల్‌తో పాటు గతంలో రష్మిక మందన్న నకిలీ వీడియో వైరల్ అయినప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద వివాదం నడిచింది. ఆ తర్వాత అక్షయ్ కుమార్, వరుణ్ ధావన్, అనిల్ కపూర్, శిల్పా శెట్టి, కార్తీక్ ఆర్యన్, నాగచైతన్య, చిరంజీవి, శృతిహాసన్ వంటి చాలామంది స్టార్లు తమ ముఖాన్ని, వాయిస్‌ను అనుమతి లేకుండా వాడకుండా ఉండేందుకు కోర్టులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇక మృణాళ్ సినిమాల విషయానికి వస్తే..

ఇటీవల 'డెకాయిట్', 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రాలతో అలరించిన ఆమె, ప్రస్తుతం డైరెక్టర్ అట్లీ తీస్తున్న భారీ సినిమా 'రాకా'లో నటిస్తున్నట్లు టాక్. అల్లు అర్జున్, దీపికా పదుకోన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏకంగా రూ.1000 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com